@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ మన వార్త
AP EDITION
విజయవాడ
బుధవారం 23 సెప్టెంబర్ 2026
ప్రతి అక్షరం... ప్రజల కోసం
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

మీ వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# ఆర్థిక కేంద్రంగా
# కుప్పం అభివృద్ధి



- ఎకనామిక్ హబ్‌గా కుప్పాన్ని అభివృద్ధి చేస్తాం
- కుప్పం అభివృద్ధిలో మరో మైలురాయి..
- దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్ ప్రారంభించిన చంద్రబాబు
- మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు

**కుప్పం**

కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్–పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పాన్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ - మిగతా3లో

## పార్లమెంట్‌లో కొత్త రికార్డు

- 40 రోజులైనా ముగియని సెషన్
- కేంద్రం ప్లాన్ ఏంటి?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డ లోక్‌సభ, రాజ్యసభ
- సాధారణంగా మూడు, నాలుగు రోజుల్లోనే ప్రొరోగ్ అయ్యే సమావేశం
- 40 రోజులుగా అధికారికంగా ముగింపు ప్రకటన లేకపోవడం ఇదే తొలిసారి





## ఉగ్రవాదంపై ప్రకటనలు కావు చర్యలు ముఖ్యం

- పాకిస్తాన్‌పై భారత్ కీలక వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్‌తో సంబంధాలపైనా ప్రకటన
- సరిహద్దు ఉగ్రవాదానికి సంబంధించి భారత విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు

# అక్టోబర్ 1న తుది జాబితా



- మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- 9 రోజుల పాటు నిర్వహణ
- మున్సిపల్ ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల గుర్తింపు ప్రక్రియ రేపటి (సెప్టెంబర్ 23) నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా రాష్ట్రంలోని 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు/నగర - మిగతా3లో



# టీడీపీకి సేవే లక్ష్యం

- డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం.. మంత్రి నారా లోకేశ్ సవాల్
- ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక..
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి
- 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్
- కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం

**అమరావతి**

ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు. తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో - మిగతా3లో



## భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం

- ఢిల్లీలో ఉన్నత స్థాయి చర్చలు విజయవంతం!
- ఢిల్లీలో విజయవంతంగా ముగిసిన భారత్
- ఒపెక్ 7వ ఉన్నత స్థాయి ఇంధన చర్చలు
- చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రతపై సమావేశం
- పరస్పర సహకారానికి అంగీకారం!



## రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ



# కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

హెచ్చరికలు జారీ చేసిన హోంమంత్రి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది

కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.

**అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రాష్ట్ర హోంమంత్రి అనిత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని హై అలర్ట్‌లో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం వాయుగుండం కొనసాగుతోంది. ఇది రానున్న 24 - మిగతా3లో

# కూటమి మరింత బలంగా ఉండాలి



- అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గింది
- కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండోరోజు పర్యటించారు
- పిఠాపురంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులకు పవన్ శ్రీకారం
- పిఠాపురం భహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి పవన్
- 'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం
- రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్‌పీటీల నిర్మాణం చేపట్టాం.

**కాకినాడ**

కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండో రోజు పర్యటించారు. ఇందులో భాగంగా రూ.1500 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంగళవారం ఉదయాన్నే పవన్ తన పర్యటనను ప్రారంభించారు. తొలుత గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీసీతారామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు పథకాల లబ్ధిదారులకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఆ తర్వాత ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ మైదానంలో నిర్వహించిన 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' బహిరంగ సభలో పవన్ పాల్గొన్నారు. 30 మంది మత్స్యకారులకు రక్షణ పరికరాలు అందించారు. నివాస గృహాల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు బ్యాగులు ఇచ్చారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు అందించారు. రైతు సంఘం నాయకులు పవన్ కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, నాగలిని - మిగతా3లో

# పార్లమెంట్‌లో కొత్త రికార్డు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల విషయంలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. లోక్‌సభ, రాజ్యసభలు నిరవధికంగా వాయిదా పడి 40 రోజులు గడిచినా, మాన్‌సూన్ సెషన్ మాత్రం అధికారికంగా ముగియలేదు. సాధారణంగా సభలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రపతి ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేస్తారు. కానీ ఈసారి ఇప్పటివరకు అలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రభుత్వం ఏదైనా కీలక బిల్లును వర్షాకాల సమావేశాలను తిరిగి కొనసాగిస్తూ తీసుకురావాలనుకుంటోందా అనే చర్చ మొదలైంది. రెండు సభలు ఇంతకాలం ప్రొరోగ్ కాకుండా ఉండటం ఇదే తొలిసారి అని మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి తాజాగా వెల్లడించారు. 2015లో కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో రెండు సభలు 28 రోజుల తర్వాత ప్రొరోగ్ అయ్యాయి. అప్పటి ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టంపై ఏకాభిప్రాయం కోసం ప్రయత్నాలు చేసింది. ఇప్పుడు 40 రోజులు దాటడంతో ఆ రికార్డు కూడా అధిగమించినట్లైంది. 2026 మాన్‌సూన్ సెషన్ జులై 20న ప్రారంభమై ఆగస్టు 13న ముగిసింది. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 సిట్టింగ్స్ జరిగాయి. రెండు సభల్లో పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే కీలకమైన కొన్ని ప్రతిపాదనలు మాత్రం పెండింగ్‌లోనే ఉన్నాయి.

**అసలు ఎందుకు ప్రొరోగ్ చేయలేదు?**

పార్లమెంట్ సమావేశం ముగియడం, సభను నిరవధికంగా వాయిదా వేయడం రెండూ ఒకటే కాదు. అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటే సభను తదుపరి తేదీ ప్రకటించకుండా వాయిదా వేయడం. ప్రొరోగేషన్ అంటే ఆ సమావేశాన్ని అధికారికంగా ముగించడం. రెండో ప్రక్రియ రాష్ట్రపతి ఉత్తర్వులతో జరుగుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంట్‌ను సమావేశపరచడం, ప్రొరోగ్ చేయడం రాష్ట్రపతి అధికార పరిధిలో ఉంటుంది. అయితే ఇది కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు జరుగుతుంది. అందువల్ల మాన్‌సూన్ సెషన్‌ను ఇంకా అధికారికంగా ముగించకపోవడం వెనుక ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి నిర్ణయంపై ఆసక్తి పెరిగింది.

**మహిళా రిజర్వేషన్- డీలిమిటేషన్‌పై చర్చ**



ప్రస్తుతం ప్రధానంగా మహిళా రిజర్వేషన్, లోక్?సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలే చర్చలో ఉన్నాయి. మహిళళకు లోక్?సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ ఇప్పటికే 2023లో చట్టంగా మారింది. అయితే దాని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన, జనగణనతో సంబంధం ఉన్న నిబంధనలు కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రధానంగా మహిళా రిజర్వేషన్, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలే చర్చలో ఉన్నాయి. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ ఇప్పటికే 2023లో చట్టంగా మారింది. అయితే దాని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన, జనగణనతో సంబంధం ఉన్న నిబంధనలు కీలకంగా ఉన్నాయి. 2026 బడ్జెట్ సమావేశాల సమయంలో మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయడానికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. అయితే అవసరమైన రాజ్యాంగ మెజారిటీ లభించకపోవడంతో ఆ బిల్లుపై తదుపరి చర్చ కొనసాగలేదు. దానికి అనుబంధంగా ఉన్న డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులు కూడా ముందుకు సాగలేదు.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల వాటా తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన కొంతకాలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు ఇది ప్రతికూలంగా మారుతుందన్న వాదన ఉంది. ఆ ఆందోళనలను తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే నిష్పత్తిలో పెంచే ఫార్ములాపై చర్చ జరుగుతోందన్న సమాచారం ఉంది. ఇందులో 50 శాతం వరకు స్థానాల పెంపు ప్రతిపాదన ఉందన్న ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ అంశంపై తుది నిర్ణయం, అధికారిక బిల్లు వివరాలు స్పష్టంగా వెలువడాల్సి ఉంది.

**ప్రత్యేక సమావేశం ఉంటుందా?**

వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రొరోగ్ చేయకపోవడంతో మరో అంశంపై కూడా ఊహాగానాలు పెరిగాయి. కొత్తగా ప్రత్యేక సమావేశం నిర్వహించకుండా, ప్రస్తుతం ముగింపు ప్రకటన రాని సమావేశాన్ని అవసరమైన సమయంలో కొనసాగించే అవకాశం ఉందా అనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన బిల్లుల కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని గతంలో పలు నివేదికలు వచ్చాయి. అయితే ఇప్పటివరకు ప్రత్యేక సమావేశానికి తేదీలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు.

**శీతాకాల సమావేశాల ముందు కీలక పరిణామం**

సాధారణంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ చివరి వారంలో ప్రారంభమై క్రిస్మస్‌కు ముందు ముగుస్తాయి. అంతకుముందే మాన్‌సూన్ సెషన్ అధికారికంగా ముగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వచ్చే రోజుల్లో కేంద్రం తీసుకునే నిర్ణయం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం మాత్రం ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఆగస్టు 13న రెండు సభలు నిరవధికంగా వాయిదా పడినా, సెషన్ అధికారికంగా ముగియలేదు. 40 రోజులకు చేరిన ఆ అసాధారణ పరిస్థితి పార్లమెంటరీ ప్రక్రియలోనే కొత్త రికార్డుగా నిలిచింది.

# భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం

ప్రపంచంలోనే అతిపెద్ద చమురు వినియోగదారుల్లో మూడో స్థానంలో ఉన్న భారత్- పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ (ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్) మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. దిల్లీ వేదికగా మంగళవారం భారత్, ఒపెక్ కూటమి మధ్య 7వ హై లెవల్ ఎనర్జీ డైలాగ్ (ఉన్నత స్థాయి ఇంధన చర్చలు) విజయవంతంగా ముగిసింది. ప్రపంచ చమురు మార్కెట్లో ఒకవైపు అనిశ్చితి, ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్న వేళ భారత్, ఒపెక్ మధ్య ఈ చర్చలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి భారత పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ, ఒపెక్ సెక్రటరీ జనరల్ హైథమ్ అల్ ఘైస్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ముఖ్యంగా చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రత, చమురు రంగంలో పెట్టుబడులు పెట్టడం వంటి అంశాల గురించి విస్తృతంగా చర్చించారు. పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అంగీకరించారు. భారత్ తన చమురు అవసరాల్లో ఏకంగా 88 శాతానికిపైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు వంటివి భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే భారత్, ఒపెక్ మధ్య పరస్పర సహకారం, సత్సంబంధాలు ఉన్నాయని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఒపెక్ ప్రధాన కార్యదర్శి అందిస్తున్న సహకారానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని హర్దీప్ సింగ్ పురీ పేర్కొన్నారు. రానున్న దశాబ్దాల్లో అంతర్జాతీయంగా ఇంధన వినియోగంలో, డిమాండ్ పెంచడంలో భారత్ కీలక శక్తిగా అవతరిస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇంధన రక్షణకు చమురు ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య నిరంతర చర్చలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇది




ఇంధన రంగంలో పెట్టుబడుల్ని ప్రోత్సహించడంతో పాటుగా ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. అప్పుడే ఇంధన సరఫరాలో అంతరాయాలు ఉండవని తెలిపారు.

**భారత్‌తో చర్చలు ఒపెక్‌కూ ముఖ్యమే!**

మరోవైపు భారత్‌తో ఇంధన భాగస్వామ్యానికి ఒపెక్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఒపెక్ సెక్రటరీ జనరల్ హైథమ్ తెలిపారు. భారత ఇంధన ప్రాధాన్యతలు, ఒపెక్ లక్ష్యాలకు చాలా దగ్గరగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రపంచ ఇంధన వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని, రానున్న దశాబ్దాల్లో భారత్ ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. ఒపెక్ కూటమి, భారత్ మధ్య ఈ ఎనర్జీ డైలాగ్ 11 సంవత్సరాలుగా కొనసాగుతోందని హైథమ్ అల్ ఘైస్ గుర్తు చేశారు. ప్రపంచంలో పుట్టుకొస్తున్న సవాళ్లను పరిష్కరించడానికి భారత్ ఎప్పుడూ దౌత్య మార్గంలో పయనిస్తుందని, చర్చల కోసమే నిరంతరం ప్రోత్సహించడం సంతోషకరమని వ్యాఖ్యానించారు.

**2015లో ప్రారంభమైన ఇంధన చర్చలు**

భారత్- ఒపెక్ మధ్య ఎనర్జీ డైలాగ్‌ను (ఇంధన చర్చలు) తొలిసారి 2015లో దిల్లీలో ప్రారంభించారు. అప్పటి నుంచి ఉన్నత స్థాయిలో సమావేశాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారుల సమాఖ్యకు, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగ దేశమైన భారత్‌కు మధ్య సమన్వయం కోసం ఇదో చక్కటి వేదికగా పనిచేస్తోంది. ప్రస్తుతం అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొనగా చమురు మార్కెట్ స్తంభించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సప్లై చెయిన్‌లో అంతరాయాలు, పెరుగుతున్న డిమాండ్ వంటి ఎన్నో అంశాలు ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భవిష్యత్తు చమురు సరఫరాను మెరుగుపర్చడం, భద్రత కోసం సకాలంలో పెట్టుబడులు కూడా అవసరమని భారత్, ఒపెక్ అభిప్రాయపడ్డాయి. ఇక ప్రస్తుత 7వ విడత చర్చలు విజయవంతం కావడంతో తదుపరి 8వ ఉన్నత స్థాయి సమావేశాన్ని ఆస్ట్రియాలోని వియన్నాలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంకా సమావేశానికి సంబంధించి తేదీలు ఖరారు చేయలేదు. వియన్నాలోనే ఒపెక్ ప్రధాన కార్యాలయం ఉంది.

# కావేరి నదీ జలాల వివాదంలో థర్డ్ పార్టీలు జోక్యం చేసుకోలేవు

కావేరీ జలాల్లో కర్ణాటకకు 70 టీఎంసీల నీటిని అదనంగా కేటాయించాలంటూ ఓ ప్రైవేట్ సొసైటీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్-పార్టీలు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఇలా సొసైటీల పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ముగియవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే చట్టపరంగా పోరాడుతున్నాయన్న కోర్టు రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని తేల్చి చెప్పింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే హక్కు ఉంటుదని పునరుద్ఘాటించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కావేరి కేసుల నేపథ్యంలో కొత్త వ్యాజ్యాలకు తావులేదంటూ పిటిషన్ కొట్టేసింది. ఇదిలా ఉండగా, కావేరీ నీటి విడుదలపై కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టుకు తన వాదనను వినిపించింది. ఆగస్టు 31 నాటికి తమిళనాడుకు నిర్దేశించిన పరిమాణం కంటే ఎక్కువ నీటిని విడుదల చేసినట్లు కర్ణాటక తెలిపింది. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తూ, తమిళనాడు వైపు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించింది. ఆగస్టు 25న సీడబ్ల్యూఎంఏ కీలక నిర్ణయం తీసుకుంది. కావేరీ వాటర్ రెగ్యులేషన్ కమిటీ (సీడబ్ల్యూఆర్?సీ) చేసిన సిఫార్సును సమర్థిస్తూ, తమిళనాడుకు 15 రోజుల పాటు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కర్ణాటక నిర్ధారించాలని ఆదేశించింది. బిలిగుండ్లులో ఈ ప్రవాహాన్ని కొనసాగించాలని సూచించింది. ఈ నిర్ణయం సీడబ్ల్యూఎంఏ 56వ సమావేశంలో తీసుకున్నారు.

**నీటి బకాయిలపై తమిళనాడు అభ్యంతరం**

అయితే కర్ణాటక నుంచి నీటి విడుదల విషయంలో తమకు రావాల్సిన వాటాలో లోటు ఏర్పడిందని తమిళనాడు ప్రభుత్వం చెబుతోంది. సీడబ్ల్యూఎంఏ దృష్టికి నీటి బకాయిల అంశాన్ని తీసుకెళ్లినా, ఆ విషయంలో ప్రత్యేకంగా ఎలాంటి ఆదేశాలు వెలువడలేదని తమిళనాడు తరఫు న్యాయవాదులు గత విచారణలో తెలిపారు. కావేరీ జలాల విడుదలపై తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వర్షాభావ పరిస్థితుల్లో తమకు రావాల్సిన నీటి వాటా అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో కర్ణాటక నుంచి తక్షణమే నీటిని విడుదల చేయించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

**ఇప్పటికే కొనసాగుతున్న న్యాయపోరాటం**

ఆగస్టు 25న సుప్రీంకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి, తన నీటి విడుదలకు సంబంధించిన ఫిర్యాదును సీడబ్ల్యూఎంఏ ముందు ప్రస్తావించుకోవచ్చని సూచించింది. ఆ తర్వాత సీడబ్ల్యూఎంఏ సమావేశమై 9,000 క్యూసెక్కుల ప్రవాహాన్ని 15 రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుతం కూడా కావేరీ నీటి పంపిణీ అంశంపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతోంది. సెప్టెంబరు 18న తమిళనాడు ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించి కర్ణాటక నుంచి తమకు రావాల్సిన నీటి వాటాను విడుదల చేయాలని కోరింది. మేట్టూరు రిజర్వాయర్‌లో పరిమిత నీటి నిల్వ మాత్రమే ఉందని, అది సుమారు 30 రోజులకు సరిపడే స్థాయిలో ఉందని రాష్ట్రం పేర్కొంది. బ్రిటీష్ పాలనా కాలంలోనే కావేరి వివాదం మూలాలు ఉన్నాయి. 1892లో, తరువాత 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ మధ్య రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. దాని ప్రకారం దిగువన ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం లభించిందని, ఎగువున ఉన్న మైసూర్ అభివృద్ధికి పరిమితులు విధించారని కర్ణాటక వాదిస్తోంది. కావేరీ నదీజలాల వివాదాన్ని పరిష్కారించడం కోసం 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జల వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 17 ఏళ్ల విచారణ అనంతరం 2007లో ట్రిబ్యునల్ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే దీనిపై ఇరు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కేసు సుప్రీంకోర్టుకు చేరింది.

## 'ఉగ్రవాదంపై ప్రకటనలు కావు చర్యలు ముఖ్యం'

సరిహద్దు ఉగ్రవాదంపై పాకిస్థాన్ విశ్వసనీయమైన చర్యలు తీసుకునే వరకు ఆ దేశం చేస్తున్న ప్రకటనలను ప్రపంచం నమ్మదని భారత్ స్పష్టం చేసింది. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదం, బంగ్లాదేశ్, జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, అమెరికా తీసుకొస్తున్న చట్టం, నేపాల్‌లో వరదల్లో గల్లంతైన భారతీయులు గుర్తింపు వంటి అంశాల గురించి స్పందించారు. పాకిస్థాన్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇటీవల ఉగ్రవాదాన్ని తుదముట్టిస్తామని, అందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత్ వైఖరి ఏంటి అని విలేకరులు ప్రశ్నించగా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ మాటలతో చెబితే సరిపోదని, తమ మాటలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, సరిహద్దు ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు అత్యంత నిబద్ధత చూపించాలని అన్నారు. ఆచరణాత్మకంగా విశ్వసనీయ చర్యలు తీసుకున్నప్పుడే అంతర్జాతీయ సమాజం పాక్ ప్రకటనల్ని నమ్ముతుందని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో పాకిస్థాన్ కొన్ని అంతర్జాతీయ న్యాయపరమైన నిర్ణయాల్ని తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోందన్న ప్రశ్నపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్‌కు వాస్తవాల్ని వక్రీకరించడం, అబద్ధాలను ప్రచారం చేయడం అలవాటేనని అన్నారు. 'పాక్ మంత్రి చెబుతున్నట్లుగా అది పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (రాజూా) అధికారిక తీర్పు కాదు. అది చట్టవిరుద్ధంగా ఏర్పాటైన ఒక కోర్టు ఇచ్చిన తీర్పు. వాస్తవాల్ని దాచిపెట్టేందుకు పాక్ చేస్తున్న ఇది మరో ప్రయత్నం మాత్రమే.' అని జైస్వాల్ వివరించారు.

**అఫ్గాన్‌లో పాక్ దాడులు- ఖండించిన భారత్**

మరోవైపు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా ప్రావిన్సులపై పాకిస్థాన్ చేపట్టిన వైమానిక దాడులను కూడా భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో పలువురు పౌరులు మరణించారని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నామని జైస్వాల్ అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దాడులతో పాకిస్థాన్- ప్రాంతీయంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తోందని స్పష్టం చేశారు. అఫ్గాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు.

**బంగ్లాదేశ్‌తో సానుకూల సంబంధాల్ని కోరుకుంటున్నాం**

ఇదే మీడియా సమావేశంలో బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై కూడా ఎంఈఏ తన వైఖరిని వెల్లడించింది. ఆ దేశంతో సానుకూల, నిర్మాణాత్మక, దీర్ఘకాల సంబంధాలను భారత్ కోరుకుంటోందని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. జోధ్‌పూర్ వేదికగా సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 12 వరకు భారత వాయుసేన నిర్వహించనున్న తరంగ్ శక్తి వైమానిక విన్యాసాల్లో బంగ్లాదేశ్ కూడా పాల్గొననుండటం శుభ పరిణామమని అన్నారు. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాల గురించి ప్రస్తావించారు. మరోవైపు జపాన్‌తో పార్లమెంటరీ స్థాయిలో పరస్పర చర్చలు కొనసాగుతున్నాయని ఎంఈఏ వెల్లడించింది. నేపాల్‌లో ఇటీవల ఘోర విపత్తులో పలువురు భారతీయులు కూడా గల్లంతయ్యారు. ఈ క్రమంలో గల్లంతైన భారతీయుల గుర్తింపు కోసం కేంద్రం ప్రయత్నాలు కొనసాగిస్తోందని వీజూూ స్పష్టం చేసింది. నేపాల్‌లో గల్లంతైన 275 మంది భారతీయులతో పాటు, భారత సంతతికి చెందిన వారి కోసం శోధిస్తున్నట్లు తెలిపారు. భారత ఫోరెన్సిక్ టీమ్ కాఠ్‌మాండూలోని ల్యాబ్‌లలో 3 వేల శాంపిల్స్ ఆధారంగా, 1200 డీఎన్ఏ ప్రొఫైల్స్‌ను రూపొందించిందని, దీనికి సంబంధించి పరిశోధన కొనసాగుతోందని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్ సహా మరికొన్ని దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు అమెరికా చట్టం తీసుకొస్తోంది. చట్టసభల ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కూడా చేశారు. ఈ ప్రతిపాదిత చట్టంపైనా కేంద్రం తాజాగా స్పందించింది. ఈ చట్టానికి సంబంధించి భారత్ తన అభిప్రాయాన్ని ఇప్పటికే అమెరికా ప్రభుత్వానికి తెలియజేసిందని ఎంఈఏ తెలిపింది. ఈ చట్టం అమెరికా- భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయంగా చమురు మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత్ స్పష్టం చేసిందని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

## రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక విషయాలను గుర్తించింది. ఆలయంలోని నగదు లెక్కింపు గది నుంచి డబ్బును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టినట్లు 105 ఘటనలు గుర్తించినట్లు సిట్? తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. నగదు వ్యవహారంలో అక్రమాలపై దర్యాప్తు కొనసాగుతుండగా, విలువైన వెండి వస్తువులు, ఇతర విరాళాల విషయంలో మాత్రం తనిఖీల్లో ఎలాంటి తేడాలు గుర్తించలేదని నివేదిక వెల్లడించింది. ఆలయంలోని యాత్రికుల సౌకర్య కేంద్రం (పీఎఫ్?సీ)లో ఉన్న నగదు లెక్కింపు గది, ఇతర డిజిటల్ ఆధారాలను సిట్? పరిశీలించింది. సీసీటీవీ ఫుటేజీ, ఇతర డేటా విశ్లేషణలో నగదు లెక్కింపు గది నుంచి అనధికారికంగా డబ్బు తీసుకెళ్లడం లేదా దాచిపెట్టడం జరిగినట్లు భావిస్తున్న 105 సందర్భాలు బయటపడినట్లు నివేదిక పేర్కొంది. ఈ ఘటనల్లో నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న మరికొందరి సహకారం ఉన్నట్లు కూడా వెల్లడైనట్లు సిట్ తెలిపింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను గుర్తించినట్లు స్పష్టం చేసింది. నిందితుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన వివరాలు, వాటిలో వివరణ లేని మొత్తాలు, అనుమానితంగా అక్రమంగా సంపాదించిన డబ్బును పెట్టుబడిగా పెట్టినట్లు భావిస్తున్న స్థిర, చరాస్తుల వివరాలను కూడా సిట్ సేకరించింది.

**ఒక్కొక్క నిందితుడి పాత్రపై దర్యాప్తు**

నగదు అక్రమంగా మళ్లించినట్లు అనుమానిస్తున్న ప్రతి వ్యక్తికి సంబంధించిన అంశాలను సిట్ విడిగా పరిశీలించింది. వారి ద్వారా ఎంత మొత్తం దుర్వినియోగానికి గురై ఉండొచ్చన్న అంచనాలను కూడా నివేదికలో పొందుపరిచినట్లు సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నగదు లెక్కింపు, నిర్వహణ జరుగుతున్న సమయంలోనే లెక్కింపు గదిలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని తెలిపింది. అక్రమ నగదు తరలింపు ఘటనల గుర్తింపుతో పాటు, సంబంధిత వ్యక్తులను గుర్తించడం, వారిని విచారించడం, అనుమానిత అక్రమ సొమ్ము ఎక్కడికి వెళ్లిందో గుర్తించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని సిట్? వెల్లడించింది.

**ఆర్థిక లావాదేవీలు, ఆస్తులపైనా నిఘా**

దర్యాప్తులో భాగంగా నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. బ్యాంకు రికార్డులు, విరాళాలకు సంబంధించిన వివరాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, ఆర్థిక పత్రాలను పరస్పరం సరిపోల్చి చూస్తున్నట్లు సిట్ తెలిపింది. ఇప్పటివరకు 173 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు నివేదికలో వెల్లడించింది. వీరిలో రామమందిర ట్రస్ట్‌కు చెందిన అధికారులు, అకౌంటింగ్ సిబ్బంది, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, చార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు.

**803 విలువైన వస్తువుల్లో వ్యత్యాసాలు లేవు**

మరోవైపు, రామమందిరానికి అందిన విలువైన వస్తువుల విషయంలో సిట్ తనిఖీలు నిర్వహించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరిచిన 803 విలువైన వస్తువులను భౌతికంగా పరిశీలించినట్లు నివేదిక తెలిపింది. ఈ వస్తువులకు సంబంధించి టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించిన రసీదులను కూడా పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులు ట్రస్ట్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. లాకర్‌లోని వస్తువులను ప్రత్యక్షంగా తనిఖీ చేసిన అనంతరం, వాటిలో ఎలాంటి వ్యత్యాసాలు కనిపించలేదని సిట్ స్పష్టం చేసింది. రసీదులు జారీ చేయని మరో 86 విలువైన వస్తువులను కూడా విడిగా గుర్తించి భౌతికంగా తనిఖీ చేసినట్లు నివేదిక పేర్కొంది.

**944 కిలోల వెండిపైనా పరిశీలన**

రామమందిర ట్రస్ట్ వద్ద ఉన్న వెండి నిల్వలకు సంబంధించిన రికార్డులను కూడా సిట్ పరిశీలించింది. సుమారు 944.411 కిలోల వెండిని కరిగించేందుకు ట్రస్ట్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు పంపినట్లు నివేదికలో పేర్కొన్నారు. అదే సమయంలో సుమారు 200 కిలోల వెండి ఇటుకలు, మరో 38.288 కిలోల వెండి ఇటుకలు, వెండి హారం, చరణ్ పాదుక, రామచరితమానస్‌కు సంబంధించిన విరాళం వంటి అంశాలను కూడా సిట్ పరిశీలించింది. వీటి నిర్వహణలో ఎలాంటి వ్యత్యాసాలను గుర్తించలేదని దర్యాప్తు బృందం తెలిపింది. ఉత్తరప్రదేశ్ పోలీస్ ఐజీ కిరణ్ ఎస్ నేతృత్వంలో సిట్ ఈ దర్యాప్తును కొనసాగిస్తోంది.

# టీడీపీకి సేవే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని అన్నారు. అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్ అంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు. నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం ఆయనకు ఉందంటూ విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వచ్చి డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని చెప్పారు.

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

### పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం

కార్యకర్తే అధినేత నినాదాన్ని ఆచరణలో అమలు చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరని అన్నారు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తీసుకొచ్చామని తెలిపారు. రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యకర్తల ఆరోగ్యాన్ని చూసుకునే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

### పనిచేస్తే పదవులు వస్తాయి

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

### అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం

కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ వెళ్తోందని లోకేశ్ చెప్పారు. అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు కేటాయిస్తామని అన్నారు. రాప్తాడు ప్రాంతానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడులు తీసుకురావడంలో స్థానిక నాయకత్వానికి కూడా బాధ్యత ఉందని చెప్పారు.

### అనంతపురంలో సేవాభావం

అనంతపురం జిల్లాలో సేవాభావం ఉందని లోకేశ్ అన్నారు. లేపాక్షి, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, ప్రశాంతి నిలయం ఉన్న నేలగా అనంతపురాన్ని ప్రస్తావించారు. ఆర్‌డీటీ దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. సేవ చేయాలనే భావన తమలో ఉందని చెప్పారు. అందుకే ఎన్టీఆర్ అనంతపురం జిల్లాను సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

### పరిటాల కుటుంబంతో అనుబంధం

పరిటాల కుటుంబంతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని లోకేశ్ తెలిపారు. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడటం ఇరు కుటుంబాల ధ్యేయమని చెప్పారు. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారని పరిటాల శ్రీరాములయ్యను గుర్తుచేశారు. పరిటాల రవీంద్ర ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారని అన్నారు. ఉమ్మడి అనంతపురంలో పలువురు కార్యకర్తలను కోల్పోయామని తెలిపారు.

### రాప్తాడులో కార్యకర్తలకు అండగా

2019 నుంచి 2024 వరకు రాప్తాడులో టీడీపీ కేడర్‌ను ఇబ్బంది పెట్టారని లోకేశ్ ఆరోపించారు. తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. తనపై 23 కేసులు పెట్టారని తెలిపారు. పార్టీ కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదేనన్నారు. ఇప్పటికే 80 శాతం తప్పుడు కేసులు తొలగించామని చెప్పారు.

# ఆర్థిక కేంద్రంగా కుప్పం అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పాన్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

### కుప్పంలో దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్

కుప్పం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. రైలు నంబర్ 11005 దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్ కల్పించారు. ఈ హాల్ట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా వాస్కోడ గామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌ను కూడా ప్రారంభించారు. ఈ అదనపు హాల్ట్‌లతో కుప్పం ప్రజలకు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడం మరింత సులభం కానుంది. ప్రయాణికులకు మెరుగైన రైలు కనెక్టివిటీ అందించడంతో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా రైల్వే సేవలను విస్తరించేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి. చంద్రబాబు నాయుడు స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ కుప్పంలో ప్రస్తుతం 59 రైళ్లకు హాల్ట్‌లు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

### కుప్పాన్ని ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం

కుప్పం ప్రాంతం క్రమంగా ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు తెలిపారు. రైల్వే కనెక్టివిటీని మరింత మెరుగుపరచడం ద్వారా ఈ ప్రాంతానికి ఆర్థికంగా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కుప్పాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానించి, రాబోయే రోజుల్లో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పర్యాటక రంగం అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని వివరించారు. కుప్పం ప్రాంతంలో రైల్వే సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా కీలక విషయాలను వెల్లడించారు. గుడిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. డీకే పల్లి చెరువు సమీపంలో కూడా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు ముందుకు సాగితే స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది.



బెంగళూరు--చెన్నై నాలుగు వరుసల రైల్వే లైన్: బెంగళూరు--చెన్నై మధ్య నాలుగు వరుసల రైల్వే లైన్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు తెలిపారు. ఈ రైల్వే కనెక్టివిటీ కుప్పం ప్రాంతానికి కూడా ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే కుప్పం నుంచి చిత్తూరుకు రైల్వే కనెక్టివిటీ కల్పిస్తే నేరుగా తిరుపతికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఈ దిశగా కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందించవచ్చని తెలిపారు.

కుప్పం ప్రాంతం నుంచి రైల్ కార్గో రవాణాకు కూడా పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. పొగురుపల్లి సమీపంలోని డ్రై పోర్టును రైల్వే కనెక్టివిటీతో అనుసంధానించి కార్గో రవాణాను మెరుగుపరుస్తామని వెల్లడించారు. దీంతో సరకు రవాణాకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో రైల్వే కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. సమీప భవిష్యత్తులో బెంగళూరు నుంచి అమరావతికి వందే భారత్ రైళ్లను నడిపేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మధ్య ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

### కుప్పం అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ కీలకం

మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు పడింది. అదనపు హాల్ట్‌లు, ఆర్వోబీల ప్రతిపాదనలు, కార్గో రవాణా, ఇతర ప్రాంతాలతో రైల్వే అనుసంధానం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. కుప్పాన్ని ఆర్థిక కేంద్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలు అమలులోకి వస్తే స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యాలతో పాటు వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.

# లోకల్ పోల్స్‌కు కాంగ్రెస్ రెడీ...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.



## కూటమి మరింత బలంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

బహుమతిగా అందజేశారు. అనంతరం బహిరంగ సభలో పవన్ మాట్లాడారు.

ఉప్పాడ తీరంలో సముద్రపు కోత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. 323 కోట్ల రూపాయలతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అమృత్ భారత్ స్కీమ్ కింద 35 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మరో నాలుగు నెలల్లో తన క్యాంపు కార్యాలయాన్ని పిఠాపురానికి మార్చనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బహిరంగసభ వేదికగా జనసేన నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గిందంటూ చురకలు అంటించారు. అదే సమయంలో కూటమి మరింత బలంగా ఉండాలని ఆకాంక్షించారు. నాయకుల ఆకాంక్షల కన్నా ప్రజల అవసరాలకు ముందు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం. రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్‌పీటీల నిర్మాణం చేపట్టాం. రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నాం. రూ.34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు ప్రారంభించాం. రూ.2 కోట్లతో కుంతీ మాధవస్వామి ఆలయ కోనేరును పునరుద్ధరించాం. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. 40 టన్నుల తడి చెత్తను శుభ్రం చేసే ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నాం.'

సభలో పాల్గొనడానికి ముందే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 9 కోట్ల 59 లక్షల రూపాయలతో ఆధునీకరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్నిప్రారంభించారు. యూ.కొత్తపల్లి మండలంలోని సమగ్ర మంచినీటి సరఫరా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. పథకం వివరాలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేలా ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా పథకాన్ని ఆధునీకరించారు. మార్గమధ్యంలో కొండేవారంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్‌ను కూడా ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ గాయత్రి దేవి, చీఫ్ ఇంజినీర్ హరి రామ్ నాయక్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### స్వామివారి ప్రాతఃకాల సేవ

చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ఉదయం స్వామివారి ప్రాతఃకాల సేవలో పాల్గొన్నారు. రాములవారికి అష్టోత్తరాలతో పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన పవన్?కి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారి ఆలయం సమీపంలో సభ నిర్వహించిన విషయం తెలిసిందే. మరోసారి స్వామివారిని దర్శించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయం అనంతరం ఆలయ అభివృద్ధికి రెండు విడతలుగా దాదాపు రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ఆలయంలో కాలక్షేప మండపం, రథశాల, అన్నదానం కోసం హాలు, యాగశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

## అక్టోబర్ 1న తుది జాబితా

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీలలో 9 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ఈ ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోఈ ప్రక్రియను చేపడతారు. 23 నుంచి 25 వరకు. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను వార్డుల వారీగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తారు. 26న ఈ జాబితాలు ఆయా మున్సిపల్ వార్డులలో ముసాయిదాగా ప్రకటిస్తారు. 27, 28 తేదీలలో ముసాయిదా ఓటర్ల గుర్తింపుపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరిస్తారు.

29, 30 తేదీలలో వీటిని పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఏమైనా దిద్దుబాట్లు ఉంటే పూర్తి చేస్తారు. అక్టోబర్ 1న ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు సంబంధించి తుది జాబితాను ప్రకటిస్తారు. బీసీ ఓటర్ల విషయంలోనూ ఇదే రకంగా గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తారు. విశాఖ రీజియన్?లో జీవీఎమ్?సీతో సహా 4, రాజమహేంద్రవరం రీజియన్?లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహా 7, గుంటూరు రీజియన్?లో 9, అనంతపురం రీజియన్?లో 21 మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో తొలి విడత కింద ఈ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో వివరించింది. ఈమేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్? కుమార్ ఉత్తర్వులు వెలువరించారు.

### తూర్పు గోదావరిలో పరిస్థితి ఇలా

అమలాపురం పట్టణంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాల ప్రచురణ ప్రక్రియ పూర్తయింది. మొదట ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను విడుదల చేయగా, ఆ తర్వాత పోలింగ్ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల వంటి వర్గాల వారీగా తుది జాబితాలను ప్రచురించారు. ఈ జాబితాలను కమిషనరేట్‌కు పంపారు. అక్కడ రిజర్వేషన్ కేటగిరీలు ఖరారు చేస్తారు. పట్టణంలోని ఆశావహ అభ్యర్థులు చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్ కేటాయింపుల ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

-మొదటిపేజీ తరువాయి

గంటల్లో మరింత బలపడనుంది. తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వాయుగుండం సెప్టెంబర్ 23 రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజామున తీరం దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు.

### ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి

వాయుగుండం ప్రభావంతో రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురవనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై దీని తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు జారీ చేయాలని ఆమె ఆదేశించారు.

### మత్స్యకారులకు హెచ్చరికలు

సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రతపై అధికారులు దృష్టి సారించారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను ఎల్లవేళలా సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు.

### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. అలాంటి ప్రదేశాలు, కాజ్‌వేల వద్ద వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రాకపోకలను కట్టడి చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగాలుల సమయంలో భారీ వృక్షాలు, భారీ హోర్డింగులు, శిథిలావస్థకు చేరిన పాత భవనాల వద్ద ప్రజలు ఉండకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. విపత్కర సమయాల్లో ప్రజలు అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన

**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 22 ( మీ వార్త ప్రతినిధి ):**.డివిజన్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు జిల్లా ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కార్యక్రమం డివిజన్ స్థాయిలో నిర్వహించారు .ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, ఏలూరు జిల్లా నేషనల్ గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్ స్వర్ణ వెంకటేశ్వరరావు మరియు డివిజనల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బి నాగేశ్వరరావు, జి గంగాధర్, శ్రీమతి ఫణీంద్ర పావని రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజన్ లో ఉన్న ప్రతి ఉన్నత పాఠశాల నుండి జీవశాస్త్ర ఉపాధ్యాయులు 112 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఈ క్రింది తెలిపిన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.




వ్యర్థం నుంచి విలువైన వస్తువు -- పర్యావరణ పరిరక్షణే మన బాధ్యత" నీటి కలుపు మొక్కలను ఉపయోగించి పాదరక్షణ చాప (ఫుట్ మ్యాట్) తయారీ,
వ్యర్థ అరటి కాండాలను ఉపయోగించి పర్యావరణహిత బయో-సంచుల తయారీ, వర్మీ కంపోస్టింగ్ (వానపాముల ఎరువు) మరియు సేంద్రీయ వ్యర్థాల నిర్వహణ విత్తన బంతులు / విత్తన కప్పుల తయారీ
పాత వస్త్రాలను ఉపయోగకరమైన వస్తువులుగా పునర్వినియోగం చేయడం, వస్త్ర సంచులు / కాగితపు సంచుల తయారీ
కాగితపు పునర్వినియోగం / చేతితో తయారు చేసిన కాగితం మరియు పరిశుభ్రమైన కాగితం వినియోగ ప్రోత్సాహం
,కాగితపు పెన్నుల తయారీ / పర్యావరణహిత పెన్నుల వినియోగ ప్రోత్సాహం
అరటి నారుతో నేయడం
వెదురు మరియు కలపతో పర్యావరణహిత ఉత్పత్తుల తయారీ
మొక్కజొన్న పొట్టు / ఆకులతో హస్తకళా వస్తువులు మరియు అలంకరణ వస్తువుల తయారీ
సహజ వనరులతో పర్యావరణహిత హస్తకళల తయారీ
.ఆకులతో ప్లేట్లు / గిన్నెలు (దోనా--పత్తల్) తయారీ,
పర్యావరణహిత విగ్రహాల తయారీ కార్యక్రమం,
చిరుధాన్యాల ఆధారిత ఆహార పద్ధతుల ప్రోత్సాహం
పర్యావరణహిత సహజ మూలికా రంగుల తయారీ
సేంద్రీయ / సహజ సబ్బుల తయారీ
నీటి కలుపు మొక్కలు (వాటర్ హయాసింత్) నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ
తో పాటు ఎల్ఈడీ బల్బుల తయారీ / మరమ్మతు
సౌరశక్తి ఆధారిత పరిష్కారాలు
విద్యుత్ / వ్యర్థాలు / నీటి వినియోగ పరిశీలన (ఆడిట్)
కార్బన్ పాదముద్ర కొలత / నీటి పాదముద్రను నమోదు చేయడం, వ్యర్థ అరటి కాండాలను ఉపయోగించి పర్యావరణహిత బయో-సంచుల తయారీ
పశువుల పేడ మరియు ఉపయోగించిన పూలతో ధూపకడ్డీల తయారీ
పాఠశాల మధ్యాహ్న భోజనంలో లభించే గుడ్డు పెంకులను ఉపయోగించి కాల్షియం పొడి తయారి
మొదలైన అంశాలు గురించి వీడియోల ద్వారా ఉపాధ్యాయులకు వివరించి, తద్వారా విద్యార్థులలో సృజనాత్మక, జ్ఞానాన్ని పెంచి పర్యావరణ స్నేహితులుగా మార్చాలని తెలిపారు.

# క్రైమ్ సమీక్షలో పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

**వై.పాలెం, గిద్దలూరు రూరల్ సర్కిళ్లలో అధికారుల సమీక్ష**

**ఎర్రగొండపాలెం : సెప్టెంబర్ 23 (మీ వార్త జిల్లా ప్రతినిధి)**
పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మార్కాపురం జిల్లా పోలీసు అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వై.పాలెం సీఐ సర్కిల్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలతో క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన నేరాలు, యూఐ కేసుల పెండెన్సీ, దర్యాప్తు పురోగతి, ఎన్ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు, స్మార్ట్ పోలీసింగ్ తదితర అంశాలపై స్టేషన్‌ల వారీగా సమీక్షించారు.
పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నేర నియంత్రణతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సమర్థవంతమైన




ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ స్మార్ట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా గిద్దలూరు రూరల్ సర్కిల్ సీఐ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, కేసుల త్వరితగతిన పరిష్కారానికి అవసరమైన సూచనలు




చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. సమస్యాత్మక వ్యక్తులు, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, పరిస్థితులకు అనుగుణంగా చట్టపరమైన బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
నేర నియంత్రణ, వేగవంతమైన దర్యాప్తు, సమర్థవంతమైన ఎన్ఫోర్స్‌మెంట్, స్మార్ట్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా అధికలోడ్ తో పామాయిల్ లారీలు...

**పట్టించుకోని అధికారులు**

**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 22 ( మీ వార్త ప్రతినిధి ):**
రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా, మితిమీరిన లోడ్‌తో ప్రయాణిస్తున్న పామ్ ఆయిల్ గెలల లారీలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయి.
ఎలాంటి ముందస్తు భద్రతా ప్రమాణాలు పాటించకుండా, ప్రమాదకర రీతిలో పామాయిల్ గెలలను రవాణా చేయడం చట్టవిరుద్ధం.
ఆర్టీఏ నిబంధనలను తుంగలో తొక్కి, అనుమతులు లేని వాహనాల్లో ఈ రకమైన రవాణా సాగించడం వెనుక అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.
బాడీ లారీల పేరుతో ఫైనాన్స్ పొంది, వాటిని అక్రమంగా టిప్పర్లుగా మార్చడం ఫైనాన్స్ సంస్థలను మరియు ప్రభుత్వాన్ని నిలువునా ముంచడమే.
రికార్డుల్లో ఒకలా, క్షేత్రస్థాయిలో మరోలా వాహనాల



రూపాన్ని మార్చి నడుపుతున్న లారీ ఓనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.ఎలాంటి అనుమతులు లేకుండా బాడీ లారీలను టిప్పర్లుగా మార్చే అక్రమ గ్యారేజీలపై, దానికి సహకరిస్తున్న యాజమాన్యాలపై తక్షణమే విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.
రహదారులపై యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ రవాణాపై రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టాలి.. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు, ఫైనాన్స్ మోసాలకు పాల్పడుతున్న లారీ ఓనర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.
మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 52 ప్రకారం, రిజిస్ట్రేషన్ అథారిటీ ముందస్తు అనుమతి లేకుండా వాహనం యొక్క అసలు నిర్మాణాన్ని మార్చడం చట్టరీత్యా నేరమైన
ఆర్టీవో అధికారులు ఫిట్‌నెస్ ఎలా ఇస్తున్నారు?అనుమతి లేని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడం వెనుక కారణాలు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# పట్టణంలో టిడ్కో ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 22 ( మీ వార్త ప్రతినిధి):** పట్టణంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సోమవారం పరిశీలించారు. పట్టణ శివారులోని మార్కండేయ పురం టిడ్కో లేఅవుట్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి బ్లాక్ లోకి వెళ్లి నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన తీరును స్వయంగా పరిశీలించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం గాలికి వదిలేసిందని కానీ కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చడమే మన అందరి ప్రభుత్వ లక్ష్యం. అందుకే పనులను వేగవంతం చేశాం. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. మంచినీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ సదుపాయాలన్నీ పూర్తి స్థాయిలో ఉండాలి" అని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. లబ్ధిదారులు ఎన్నో ఏళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, వారి ఎదురుచూపులకు డిసెంబర్ తో తెరపడుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. "డిసెంబర్ నాటికి మిగిలిన పనులన్నీ 100% పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తాం. దీనికి సంబంధించి అధికారులకు డెడ్ లైన్ పెట్టాం. ప్రతి వారం పురోగతిపై నివేదిక ఇవ్వాలి" అని అన్నారు.ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్, టిడ్కో డీఈ, ఏఈలు, కూటమి నాయకులు, స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన -ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ



**అయినవిల్లి సెప్టెంబర్ 22( మీ వార్త విలేఖరి).** అయినవిల్లి మండలంలోని ప్రసిద్ధ శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహించిన చవితి ఉత్సవాల చివరి రోజు శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు పి.గన్నవరం నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చవితి ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో, చివరి రోజు కూడా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆలయ సిబ్బందికి, నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. స్వామివారి కృపతో చవితి ఉత్సవాలు విజయవంతంగా ముగిసి, భక్తులందరికీ ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్




**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 22 ( మీ వార్త ప్రతినిధి ):** పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి సేవా సంకల్ప్ అభియాన్--2026 వైద్య శిబిరాన్ని శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు మరియు ఆరోగ్య పరీక్షల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

## విద్యార్థులు బయోమెట్రిక్ ఆధార్ అప్డేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**రౌతులపూడి సెప్టెంబరు 22:( నీ పాత న్యూస్ ప్రతినిధి )**
మండలంలోని ఆధార్ కార్డు అప్డేట్ కానీ విద్యార్థులు ఆధార్ అప్డేట్ సెంటర్లను సద్వినియోగం చేసుకొని వారి యొక్క ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఎమ్. సత్తిబాబు మరియు గాడి కొండబాబులు సూచించారు. మండలంలోని ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు విషయాన్ని తెలియజేయాలన్నారు. మండలంలో ఎమ్. బి. యు. ( బయోమెట్రిక్ అప్డేట్ ) చేయుటకు రౌతులపూడిలో విజేత కాలేజీ నందు, మరియు శ్రీ హర్ష స్కూల్ నందు ఏర్పాటు చేశారన్నారు. కావున విద్యార్థులు ఆధార్ అప్డేట్ అవ్వలేదో వారికీ ఉపాధ్యాయులు త్వరగా తెలియజేసి విద్యార్థులందరూ సకాలంలో ఆధార్ కార్డులు అప్డేట్ చేసుకునేటట్లు సమాచారాన్ని అందజేసి సహకరించాలని ఉపాధ్యాయులకు తెలిపారు

## బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు..



**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** మండలంలోని రాచన్న గూడెం గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9వ రోజు మంగళవారం మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు అందుకున్న గణపతి లడ్డు ప్రసాదాన్ని వేలం వేయగా 10.000 వేల రూపాయలకు బరగటి రాజు వేలంలో స్వామి వారి లడ్డు దక్కించుకున్నారు. 10వ రోజు బుధవారం స్వామివారి ఊరేగింపు మేళ తాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అనంతరం నిమజ్జనం కార్యక్రమం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సున్నం వరలక్ష్మి. వీరంకి పుల్లారావు. వనమా రామకృష్ణ. వెంకటేశ్వర రెడ్డి. బరగడ రాజు. పేరు బోయిన దాము. కొప్పుల కార్తీక్. వీరంకి వెంకటేశ్వరరావు. వీరంకి శ్రీను. తుమ్మలపల్లి వెంకటరమణ. అల్లి కిషోర్. వీర మల్ల శ్రీను. గొడుగుల చందు. పేరు బోయిన వెంకన్న బాబు. వీరమల్ల వీరేంద్ర. వీరంకి శ్రీను. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. .

# పదవి కోసం కాదు.. ప్రజల గుండెల్లో స్థానం కోసం

**యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వ్యాఖ్యలు.. ప్రజలతో అనుబంధమే రాజకీయ లక్ష్యమనే సందేశం**

**యర్రగొండపాలెం : సెప్టెంబర్ 23 (మీ వార్త జిల్లా ప్రతినిధి)**
“నేను పదవి కోసం రాలేదు.. యర్రగొండపాలెం ప్రజల గుండెల్లో స్థానం కోసం వచ్చాను” అంటూ యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. పదవి, అధికారం అనే అంశాల కంటే ప్రజలతో ఉండే అనుబంధానికే ప్రాధాన్యత ఇస్తున్నాననే భావనను ఆయన ఈ వ్యాఖ్య ద్వారా వ్యక్తం చేసినట్లు కనిపిస్తోంది.
ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక ఎమ్మెల్యేకు అధికారికంగా లభించే హోదా రాజ్యాంగబద్ధమైన బాధ్యత. అయితే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించడం మాత్రం అధికారిక పదవితో స్వయంచాలకంగా వచ్చే గుర్తింపు కాదు. ప్రజా సమస్యలపై స్పందించడం, ప్రజలకు అందుబాటులో ఉండటం, నియోజకవర్గ అభివృద్ధి అంశాలను ముందుకు తీసుకెళ్లడం, కార్యకర్తలు, ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించడం వంటి అంశాల ద్వారా మాత్రమే ఆ అనుబంధం ఏర్పడుతుంది.
ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ చేసిన “ప్రజల గుండెల్లో స్థానం” అనే వ్యాఖ్యకు రాజకీయంగా ప్రత్యేకమైన ప్రాధాన్యత ఏర్పడుతోంది. ఒక ఎమ్మెల్యేగా తన రాజకీయ పాత్రను కేవలం పదవితో కాకుండా ప్రజలతో తనకున్న అనుబంధం ద్వారా నిర్వచించుకోవాలనే సంకేతాన్ని ఈ వ్యాఖ్య ఇస్తోంది.

**పదవి ఒక బాధ్యత.. ప్రజల విశ్వాసం మరో స్థాయి**
రాజకీయ పదవి లభించడం ఒక దశ అయితే, ఆ పదవికి తగిన విధంగా ప్రజల విశ్వాసాన్ని



నిలబెట్టుకోవడం మరో దశ. ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రశేఖర్ విషయంలో కూడా ఇదే అంశం కీలకంగా మారుతుంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల సమస్యలు, మౌలిక వసతులు, సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలు ప్రజా ప్రతినిధి ముందున్న ప్రధాన బాధ్యతల్లో భాగం. ఈ సమస్యలపై ఎమ్మెల్యే స్థాయిలో జరిగే జోక్యం, ప్రభుత్వ శాఖలతో సమన్వయం, పరిష్కారానికి తీసుకునే చర్యలే ప్రజల్లో ఆయనపై ఏర్పడే అభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి.
అందుకే “గుండెల్లో స్థానం” అనే మాటకు అసలు అర్థం ప్రజా సమస్యల పరిష్కారంలోనే కనిపించాల్సి ఉంటుంది. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటం, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాల ద్వారా ఆ మాట ఆచరణలో ప్రతిబింబించాల్సి ఉంటుంది.

**రాజకీయానికి కొత్త నిర్వచనమా?**
“నేను పదవి కోసం రాలేదు” అనే వ్యాఖ్యను మరో కోణంలో చూస్తే, రాజకీయ పదవిని లక్ష్యంగా కాకుండా ప్రజాసేవకు సాధనంగా చూడాలనే సందేశంగా అర్థం చేసుకోవచ్చు. ప్రజా ప్రతినిధికి పదవి తాత్కాలికమైనదైనా, ప్రజలతో ఏర్పడే సంబంధం దీర్ఘకాలికంగా ఉండాలనే భావన ఇందులో వ్యక్తమవుతోంది.
అయితే రాజకీయ నాయకుడి ప్రజాదరణను కేవలం ఒక ప్రకటన ఆధారంగా అంచనా వేయడం సాధ్యం కాదు. ప్రజల స్పందన, నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలు, సమస్యల పరిష్కారంలో చూపిన చొరవ, ప్రజలకు అందుబాటులో ఉండే విధానం వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది.

**ముందున్న అసలు పరీక్ష ఇదే**
తాటిపర్తి చంద్రశేఖర్ చేసిన ఈ వ్యాఖ్యకు అసలు పరీక్ష ఇకపై ఆయన ప్రజాప్రతినిధిగా నిర్వహించే పాత్రలోనే ఉంటుంది. “ప్రజల గుండెల్లో స్థానం” అనే లక్ష్యాన్ని ఆయన ఏ విధంగా ఆచరణలో చూపిస్తారు? నియోజకవర్గంలోని సాధారణ ప్రజల సమస్యలకు ఎంత ప్రాధాన్యత ఇస్తారు? అభివృద్ధి అంశాల్లో ఎలాంటి చొరవ తీసుకుంటారు? కార్యకర్తలు, ప్రజలతో సంబంధాలను ఎలా కొనసాగిస్తారు? అనే అంశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి.
మొత్తంగా చూస్తే.. “పదవి కోసం కాదు.. ప్రజల గుండెల్లో స్థానం కోసం వచ్చాను” అనే తాటిపర్తి చంద్రశేఖర్ వ్యాఖ్య ఒక సాధారణ రాజకీయ ప్రకటనగా కాకుండా, తన ప్రజా జీవితాన్ని ప్రజలతో ఉన్న అనుబంధం చుట్టూ నిర్వచించుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది. పదవి ద్వారా వచ్చిన అధికారాన్ని ప్రజా ప్రయోజనాలకు ఎంతవరకు ఉపయోగిస్తారు, ప్రజల విశ్వాసాన్ని ఎంతకాలం నిలబెట్టుకుంటారు అన్నదే ఈ వ్యాఖ్యకు పూర్తి అర్థాన్ని ఇవ్వనుంది.
పదవి ఉండటం ఒక గుర్తింపు కావచ్చు.. కానీ ప్రజల మనసుల్లో నిలవడం మాత్రం పనితీరుతోనే సాధ్యమవుతుంది.

# జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన వద్దు..

**వెలుగొండ నిర్వాసితులకు కలెక్టర్ “యం.విజయ సునీత” భరోసా**

**అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ న్యాయం జరిగేలా చర్యలు.. మిగిలిన జాబితాపై ప్రత్యేక విచారణ**

**మార్కాపురం : సెప్టెంబర్ 23 (మీ వార్త జిల్లా ప్రతినిధి)**
వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత జాబితాలో తమ పేర్లు కనిపించలేదని ఆందోళన చెందుతున్న నిర్వాసితులకు మార్కాపురం జిల్లా కలెక్టర్ “ఎం.విజయ సునీత” భరోసా కల్పించారు. జాబితాలో పేరు లేకపోవడం వల్ల అర్హత ఉన్న కుటుంబాలు తమ హక్కులను కోల్పోవాల్సిన పరిస్థితి ఉండదని, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంతో పునరావాసం, పరిహారం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసిత కుటుంబాలకు జాబితాలే కీలకంగా మారాయి. అయితే ప్రస్తుత జాబితాలో కొందరి పేర్లు లేకపోవడంతో వారు తమకు పరిహారం, పునరావాస ప్రయోజనాలు అందుతాయా లేదా అనే ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసితుల సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ స్పందించారు.

**మిగిలిన జాబితాపై ప్రత్యేక విచారణ**
ప్రస్తుత జాబితాలో పేర్లు నమోదు కాని వారి అంశాన్ని సాధారణ ప్రక్రియగా కాకుండా ప్రత్యేకంగా పరిశీలించాలని కలెక్టర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మిగిలిన జాబితాపై జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేకంగా విచారణ చేయించి, అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దీనివల్ల జాబితా తయారీలో ఎక్కడైనా



లోపాలు, అర్హుల పేర్లు నమోదు కాకపోవడం వంటి అంశాలు ఉంటే వాటిని పరిశీలించే అవకాశం ఏర్పడింది.

**అర్హతే ప్రామాణికం.. న్యాయం జరిగేలా చర్యలు**
నిర్వాసితుల విషయంలో అర్హతే ప్రధాన ప్రాతిపదికగా ఉండాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో పరిహారం, వర్తించే పునరావాస ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏ కారణంతోనైనా అర్హులైన కుటుంబాలు ప్రయోజనాలకు దూరం కాకుండా వారి అభ్యంతరాలు, ఆధారాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**నిర్వాసితుల్లో పెరిగిన ఆశలు**
ఏళ్లుగా ప్రాజెక్టు కోసం తమ భూములు, ఇళ్లు, జీవనాధారాలను వదులుకున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసం అంశం అత్యంత కీలకమైనది. ఈ నేపథ్యంలో ప్రస్తుత జాబితాలో పేరు లేని కుటుంబాలకు కూడా అవకాశం ఉందని కలెక్టర్ ఇచ్చిన భరోసా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అధికారులు చేపట్టే విచారణ, అర్హుల గుర్తింపు, తుది జాబితా రూపకల్పన, పరిహారం పంపిణీ ప్రక్రియ ఎంత వేగంగా పూర్తవుతుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.
మొత్తంగా, జాబితాలో పేరు లేదనే కారణంతో అర్హులైన నిర్వాసితులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇచ్చిన హామీ వారికి ఊరటనిస్తోంది. మిగిలిన జాబితాపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం తీసుకునే తదుపరి చర్యలపై నిర్వాసితులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కుక్కునూరు మండలనికి వెటర్నరీ డాక్టర్ను నియమించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కి ధన్యవాదములు

**యాదవ్ సంగం ఉపాధ్యక్షులు అల్లాడి సురేష్**

**కూకునూరు మీ వార్త సెప్టెంబర్ 22**
ఏలూరు జిల్లా కుకునూర్ మండలం లో వెటర్నరీ డాక్టర్ గత కొంత కాలంగా అందుబాటులో లేనందున మండలం లోని గొర్రెలు మేకలు పశువులు కు అందాల్సిన మెడిసిన్ అర కొర గానే అందుతున్నాయి అని, పోలవరం నియోజకవర్గ యాదవ సంఘ ఉపాధ్యక్షులు అల్లాడి సురేష్ ఎంపీ మహేష్ కుమార్ కి, ఏలూరు జిల్లా యాదవ సంఘ అధ్యక్షులు ముమ్మడి చింతయ్య యాదవ్ దృష్టి కి తీసుకువెళ్లగా తక్షణం స్పందించి, జేడీ కి సమస్య ను వివరించ గా, జీలుగుమిల్లి ఏడి ని,కుకునూర్ మండలం కు పంపించడం జరిగింది, ఏడి మండలం లోని అర కొర గా మందులు అందటానికి కారణం ఏమిటి అని సచివాలయాల వెటర్నరీ డిపార్ట్మెంట్ వారిని ప్రశ్నించగా మండలం లో ని రెండు మూడు పంచాయతీ ల లోనే అధికారులు అవగాహనా లోపం వల్ల సమస్య ఎక్కువ ఉన్నట్టు గుర్తించారు, ఏడి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి నత్త ల నివారణ మందులు వ్యాక్సినేషన్ 100%వస్తున్నాయి అని ఎవరైనా క్షేత్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తమ దృష్టి కి తీసుకురావాలని తెలిపారు, అలాగే అందుబాటులో వున్న మందులు ను, గొర్రెలు పెంపకం దారులు కు పశువులు యజమానులు కు, అల్లాడి సురేష్ తో కలిసి అందించటం జరిగింది, అలాగే భవిష్యత్తు లో అందరి కి మెడిసన్ అందేలా ఎవరికి ఇబ్బంది కలగకుండా



చూస్తామని త్వరలో క్యాంప్ లు కూడా ఏర్పాటు చేసి మెడిసిన్ అందించటం జరుగుతుంది అని ఏడి తెలియపరిచారు, అల్లాడి సురేష్ మాట్లాడుతు ప్రభుత్వం నుండి నత్త ల నివారణ వ్యాక్షనేషన్ మందులు వంద శాతం వస్తున్నాయి అని కాని క్షేత్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యం వల్ల అవి అర్హులు కు అందటం లేదు అని వ్యాఖ్యానించారు, భవిష్యత్తు లో ఇబ్బంది కలగకుండా గొర్రెలు, మేకలు, పశువులు కు అవసమైన మెడిసిన్ అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసారు మండలం లోని సమస్య ను వివరించి న వెంటనే స్పందించిన, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కి, జిల్లా యాదవ సంఘ అధ్యక్షులు ముమ్మడి చింతయ్య యాదవ్ కి కృతజ్ఞతలు తెలియజేసారు.

## అనంతగిరి నూతన “ఏటీడబ్ల్యూఓ”గా మల్లికార్జునరావు బాధ్యతల స్వీకరణ.



**అనంతగిరి,సెప్టెంబర్ 22 ( మీ వార్త )** అనంతగిరి మండల నూతన సహాయ గిరిజన సంక్షేమ అధికారి (ఏటీడబ్ల్యూఓ)గా మల్లికార్జునరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో శ్రీకాకుళం జిల్లా మందసలో పనిచేసిన ఆయన బదిలీపై అనంతగిరికి వచ్చారు.మండల ఏటీడబ్ల్యూఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు,వివిధ శాఖ అధికారులు,సిబ్బంది సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యూఓ శాంతి పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు బదిలీపై వెళ్లారు.అనంతరం నూతన ఏటీడబ్ల్యూఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని అన్నారు.మండలంలోని ఆశ్రమ పాఠశాలలు,వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి,విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు.సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు,హాస్టల్ వార్డెన్లు,ఉపాధ్యాయులు,సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంగ,అప్పలనాయుడు,హాస్టల్ వార్డెన్లు ప్రసాద్,మోహన్,సుబ్రహ్మణ్యం ప్రధానోపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతగిరి మండల రైతులకు వర్షపాతం హెచ్చరిక.

**వ్యవసాయ అధికారి కె రంగ రావు.**



**అనంతగిరి,సెప్టెంబర్ 22 ( మీ వార్త )** అల్లూరి జిల్లా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ రైతులు అప్రమత్తంగా ఉండాలని అనంతగిరి వ్యవసాయ అధికారి రంగారావు ప్రకటనలో చేశారు.ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు సూచనలు వెల్లడించారు.పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.వర్షపు నీరు అధికంగా చేరే ప్రాంతాల్లో అవసరమైన నీటి పారుదల చర్యలు చేపట్టాలి.ఇప్పటికే వేసిన పంటల్లో వేరుకుళ్లు,ఆకుమచ్చ,ఇతర తేమ సంబంధిత తెగుళ్లను గమనించాలి.అధిక వర్షాల సమయంలో ఎరువులు మరియు పురుగుమందుల పిచికారీని వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు.నాట్లు/విత్తనాలు వేయాల్సిన రైతులు భారీ వర్షం తగ్గిన తర్వాత నేల పరిస్థితిని పరిశీలించి పనులు చేపట్టాలి.ఉరుములు,మెరుపుల సమయంలో రైతులు పొలాల్లో ఉండకుండా సురక్షిత ప్రదేశంలో ఉండాలని వ్యవసాయ అధికారి రంగారావు తెలిపారు.

## భారీ వర్షాలకు అనంతగిరి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర.**



**అనంతగిరి,సెప్టెంబర్ 22 ( మీ వార్త )** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మండలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని,మండల వాసులు అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర తెలియజేశారు.రాబోయే మూడు రోజులు ఇంకా అధికంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున గిరిజనులు అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని ఆయన కోరారు.మండలంలో ప్రవహిస్తున్న గోస్తని,వంటి నదులు పొంగే ప్రమాదం ఉందని,గెడ్డలు,వాగులు దాటేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలని సూచించారు.కురుస్తున్న భారీ వర్షాలకు శిథిలమై ఉన్న గృహాలు,చెట్ల కింద తలదాచుకోవద్దని,అవి కూలిపోయే ప్రమాదం ఉందని,అటువంటి ప్రదేశాలలో ఎవరూ ఉండవద్దని ఆయన అన్నారు.అంతేకాకుండా భారీ వర్షాలకు పశు సంపదకు కూడా ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని,ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

## జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను కలిసిన బుల్లెట్ ధర్మారావు

**విజయవాడ సెప్టెంబర్ 22(మీ వార్త ప్రతినిధి)** ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడ లో హోటల్ ఐలాపురం ఎదురుగా గాంధీనగర్ సెంటర్ నందు మా మిత్రమండలి ఉ మా ఆర్ట్స్ అధ్యక్షులు చింతల రామారావు (బాబి) చింతల రవికుమార్ (చంటి). ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతున్నది.ఈ కార్యక్రమం నకు బాబి చంటి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా



ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ సామినేని ఉదయభాను రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర - తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు ఉ జనసేన పార్టీ నాయకులు బుల్లెట్ ధర్మారావు మచిలీపట్నం. పాల్గొనినారు. ఈ సందర్భంగా బాబి చంటి గారు మరియు వారి మిత్రబృందం ముందుగా ఉదయభాను ని బుల్లెట్ ధర్మారావు ని దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను తీర్థప్రసాదాలను బహుకరించినారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన భరతనాట్యం. చిన్నపిల్లల డాన్సులను వివిధ సాంస్కృతి కార్యక్రమాలను తిలకించి. భాను ధర్మారావు బాబి., చంటి వారి మిత్రబృందంలను ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినందుకు వారిని అభినందించినారు... ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు ఉదయభాను ని ప్రత్యేకంగా కలిసి తాను మచిలీపట్నం రాధా రంగా మిత్రమండలి వారికి మేయర్ గా నేను మా కమిటీ సభ్యులకు10 కార్పొరేటర్ సీట్లను కేటాయించవలసినదిగా కోరుచున్నాను.కావున మీరు కూడా మాకు మద్దతు తెలియజేయవలసిందిగా కోరినారు.. అప్పుడు సామినేని ఉదయభాను బాబీ చంటి కూడా మొదట నుండి రాధా రంగా మిత్రమండలి అంటేనే అందరికీ గుర్తుకు వచ్చేది బుల్లెట్ ధర్మారావే కాబట్టి తప్పకుండా మా మద్దతు ఉంటుందని అక్కడ హాజరైన అందరూ కూడా ధర్మారావు గారికి మద్దతు తెలియజేసినారు..

# తల్లాడలో భక్తిప్రపత్తులు.. గణనాథుడి సేవలో మంత్రి పొంగులేటి!

**రాష్ట్ర ప్రజలపై ఆ విఘ్నేశ్వరుడి కరుణాకటాక్షాలు ఉండాలి: మంత్రి పొంగులేటి**

**వాసవి కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్‌లో వైభవంగా ప్రత్యేక పూజలు**

**నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సమన్వయంతో సాగాలి: మంత్రి పిలుపు**



**తల్లాడ, మీ వార్త ప్రతినిధి. 22.9.2026** ఆటంకాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆకాంక్షించారు.
గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తల్లాడ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన లంబోదరుడిని మంగళవారం వారు దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గణనాథునికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు.
ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం సాగాలి:
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలను అదే స్ఫూర్తితో ముగించాలని కోరారు. రానున్న నిమజ్జన వేడుకలను భక్తులంతా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో, పరస్పర సమన్వయంతో జరుపుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు నంబూరు మోహన్ రావు, వేమిశెట్టి నాగన్న, జవ్వాజి సుబ్బారావు, జవ్వాజి నరసింహారావు, దార విష్ణు మోహనరావు, కమిటీ సభ్యులు, మండల, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో 11 వారాలుగా కొనసాగుతున్న స్వచ్ఛ భారత్: గట్టిం

**ప్రతి నాయకుడు గ్రామ స్థాయి నుంచి వచ్చిన వారే: శేషు**



**పెంటపాడు సెప్టెంబర్ 22 (మీ వార్త ప్రతినిధి)** పెంటపాడు గ్రామంలో బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగ సత్యనారాయణ (శేషు), ఓబీసీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జామీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమం నేటికీ దిగ్విజయంగా 11వ వారానికి చేరుకుందని లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. ఆదివారం పెంటపాడులో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఊరచెరువు గట్టుపై గుబురుగా మొలిచిన చెత్తా,చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. చెరువుగట్లపై, రోడ్లకు ఇరుపక్కల చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించి స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ హితం, ప్రజా సంక్షేమం, ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పెంటపాడు లో బిజెపి నాయకులు శేషు,ప్రవీణ్ కుమార్ లు కొనసాగించడం అభినందనీయం అన్నారు. ప్రతి పౌరుడు దేశం పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత, పారదర్శకత కలిగి ఇటువంటి కార్యక్రమాలు చేయాలన్నారు. కొత్తపల్లి శేషు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన అభ్యుదయ కార్యక్రమాల్లో స్వచ్ఛభారత్ విశిష్టమైనదని ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశానికి దొరికిన ఒక ఆణిముత్యం అని కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశ పౌరులంతా సుభిక్షంగా, ఆరోగ్యంగా భద్రతగా జీవిస్తున్నామన్నారు. ఎంతటి ఉన్నతి పదవులు సాధించిన వారైనా ఒకనాడు గ్రామస్థాయి నుంచే వచ్చారన్న విషయాన్ని మర్చిపోవద్దని గుర్తు చేశారు. గ్రామ స్థాయి నాయకులను చిన్న చూపు చూడడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జామి ప్రవీణ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ నల్లమిల్లి గోపిరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాశి, వెంకటేష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ఉపకులపతి డా. కె. ధనంజయరావు కు డాక్టర్ హెచ్ బి సింగ్ అవార్డు

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 22 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం మండలంలోని వెంకటరామన్నగూడెం డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. కె. ధనంజయరావు ప్రతిష్ఠాత్మక డాక్టర్ హెచ్.బి. సింగ్ అవార్డు (హార్టికల్చర్) కు ఎంపికయ్యారు. ఉద్యాన రంగంలో విశేష సేవలు, పరిశోధన, విద్యార్థులకు మార్గదర్శకత్వాన్ని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రకటించారు. ఉద్యాన రంగంలో అత్యుత్తమ కృషి చేసిన వారికి మాత్రమే ఈ అవార్డు లభిస్తుంది. కట్టుపల్లి ధనంజయరావు ఎంతో మంది రైతులు, పరిశోధకులు, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన నేతృత్వంలో అనేక నూతన ఆవిష్కరణలు జరిగి, సరికొత్త పద్ధతులు ప్రవేశపెట్టబడ్డాయి. ఇది దేశంలో ఉద్యాన పంటల ఉత్పత్తి, నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. ఉత్తరాఖండ్ లోని భార్సార్ లో ఉన్న వీసీఎస్‌జీ ఉద్యాన, అటవీ విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్, బయో డైవర్సిటీ ఇంటర్నేషనల్, ఐఎఫ్‌డీసీ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న 6వ అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ధనంజయరావు మాట్లాడుతూ ఈ అవార్డును వ్యక్తిగత విజయంగా కాకుండా సహచరులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, విశ్వవిద్యాలయ సిబ్బంది సమిష్టి కృషికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని అన్నారు. రైతు సంక్షేమం, ఉద్యాన రంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, విభాగాధిపతులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.



# భీమవరం పట్టణ అభివృద్ధికి రూ 43 కోట్లు

**హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ తో పట్టణాల రూపురేఖల్లో మార్పు**

**జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు రూ 210 కోట్లు .. ఎమ్మెల్యే అంజిబాబు, గంటా త్రిమూర్తులు,జిల్లా కలెక్టర్ నాగరాణి**



**భీమవరం : సెప్టెంబర్ 22 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచి పట్టణాల రూపురేఖలను మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని భీమవరంలోని ఆనంద్ ఇన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటి చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కూటమి ప్రముఖులు నాయకులు పాల్గొని వీక్షించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.
ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్ గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, భీమవరం పట్టణ అభివృద్ధికి రూ 43 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో సెంట్రల్ లైటింగ్, రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు చేపడతామని, పట్టణాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన అనంతరం సుమారు రూ 100 కోట్ల అదనపు నిధులు వస్తాయని, వాటితో పట్టణ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఎమ్మెల్యే అంజిబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.
జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో సుమారు రూ 7,469 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల అభివృద్ధికి సుమారు రూ 210 కోట్లు మంజూరు కాగా భీమవరం పట్టణానికి రూ 43 కోట్ల నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. మంజూరైన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఈ పనులను పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# ఎం.ఎల్. ఏ కాగిత కృష్ణా ప్రసాద్ పై బురద చల్లాలని చుస్తే ఎవడు అయిన వదలం...

**.టీడీపీ కృత్తివెన్ను మండల సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య**



**కృత్తివెన్ను సెప్టెంబర్ 22(మీ వార్త ప్రతినిధి)** పెడనలో జరిగిన 11 పార్టీ మీటింగ్ లో, 11 పార్టీ జిల్లా అధ్యక్షుడిని అని చెప్పుకుంటున్న బందర్ బోడిలింగం, నకిలీ పట్టాల నేరగాడు, పేదల రేషన్ బియ్యం దొంగా పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ పై నోటికి వచ్చిన పిచ్చి ప్రేలాపనలు అన్ని గట్టిగా ప్రేలాడు అని, వాడికే చెబుతున్నాను మా నాయకుడు కాగిత కృష్ణా ప్రసాద్ జోలికి వస్తే మాకు మీ 11 పార్టీలో గల్లీ అధ్యక్షుడు అయిన ఒకటే, జిల్లా అధ్యక్షుడు అయిన ఒకటే అని కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు. మంగళవారం మీడియాతో తో మాట్లాడిన పిన్నెంటి రత్తయ్య అధికారంలో ఉంటే గొడ్డలి పార్టీ నాయకుల్లా దొంగా పట్టాలు పుట్టించాలని, రేషన్ మాపియా చేసి ఇంట్లో ఆడవాళ్ళ పేరుతో గౌడవున్లు కట్టి పేదల బియ్యం దయాలని, నకిలీ పట్టాలు పుట్టించి కోట్లకు కోట్లు ప్రభుత్వ ధనం కొల్లగొట్టాలి అని మా నాయకుడు కాగిత కృష్ణా ప్రసాద్ తెలియదు బందరు బోడిలింగం అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. పేదల రేషన్ బియ్యాన్ని పెళ్ళాం పేరుతో కట్టిన గౌడవున్ లో దాచి అడ్డంగా దొరికినప్పుడు నిన్ను జైలుకి పార్సిల్ చెయ్యకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆడవాళ్ళ పేరుతో దొంగా వ్యాపారం చేసే సన్నాసుల కోసం ఇంట్లో ఉండే ఆడవాళ్లను ఎందుకు యిబ్బంది పెట్టడం అని వదిలేసారు అని, అది మా నాయకుడు, ముఖ్యమంత్రి చూపిన మానవత్వం అని కానీ మీలాంటి అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు పట్టుకునే నికృష్టులకు అది తెలియదు అని, మీరు ఇంకోసారి మా నాయకుడు కాగిత కృష్ణా ప్రసాద్ పై గాని మా పెడన నియోజకవర్గం కూటమి నాయకులపై గాని నోరు పారెసుకుంటే, సమాధానం చెప్పడానికి మీ యిల్లు ముట్టడించడానికి కూడా మేము పెడన నియోజకవర్గం పసుపు సైన్యం సిద్ధంగా ఉంటుంది అని పెడన నియోజకవర్గంలో మాట్లాడేటప్పుడు మీ నోరు, ఒళ్ళు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మీ వంటికి అదే శ్రేయస్కారం అని కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు.......

# గణేష్ మండపాలను దర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**తల్లాడ మీ వార్త ప్రతినిధి. 22.9.2026** సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య పలు గణేష్ మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ రోడ్, బైపాస్ రోడ్, తుమ్మూరు రామారావు వీధి, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి గణనాథునికి పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లో ముత్యాలమ్మ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సండ్ర వెంకట వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుని ఆశీస్సులతో సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, యురారోగ్యాలతో ఉండాలని సండ్ర వెంకట వీరయ్య ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెడన పట్టణ అభివృద్ధికి రూ.12 కోట్ల నిధులు

**హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన**



**పెడన సెప్టెంబర్ 22(మీ వార్త ప్రతినిధి)** పెడన పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపం నందు నిర్వహించిన కార్యక్రమంలో, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా రూ.12 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ , కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీ జీకే. బాలాజీ , ఆర్డీవో శ్రీ కె. సాంబశివరావు , పెడన నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ శ్రీ పంచికర్ల సురేష్ , పెడన మున్సిపల్ కమిషనర్ , సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పెడన మున్సిపాలిటీ అభివృద్ధికి ఇంత భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాను. ఈ నిధులతో పట్టణంలోని రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, పట్టణ రవాణా, ఇతర మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే అవకాశం కలుగుతుంది. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వసతులు, ఆధునిక పట్టణ సేవలు అందించడమే మా లక్ష్యం. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాము. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ప్రతి పనిని పూర్తి చేయడంలో ఎలాంటి రాజీ ఉండదు. పెడన అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పట్టణాన్ని మరింత ప్రణాళికాబద్ధంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాము. పెడన నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన --- పెడన పట్టణ అభివృద్ధిలో మరో ముఖ్యమైన మైలురాయి.

## పిట్టలంక దళితవాడలో గణేష్ మండపం వద్ద విశ్వహిందూ పరిషత్ అవగాహన కార్యక్రమం



**కోడూరు, సెప్టెంబర్ 21:(మీ వార్త ప్రతినిధి)** భక్తి పాటలు, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, శబ్ద కాలుష్య నివారణపై భక్తులకు అవగాహన విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ గారి సూచనల మేరకు వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కోడూరు మండలం పిట్టలంక గ్రామంలోని దళితవాడలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు గణేష్ మండపాన్ని సందర్శించి భక్తులను కలుసుకున్నారు. గణేష్ మండపాలు భక్తి, ఆధ్యాత్మికతకు కేంద్రాలుగా నిలవాలని, మండపాల వద్ద భక్తి భావాన్ని పెంపొందించే భక్తి పాటలను మాత్రమే ప్రసారం చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను భక్తులకు వివరించి, ఉత్సవాల సమయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని కోరారు. అదేవిధంగా అధిక శబ్దం వల్ల ప్రజలకు, వృద్ధులకు, చిన్నారులకు కలిగే ఇబ్బందులను వివరిస్తూ శబ్ద కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని పోలీసు శాఖ సూచనలు, భద్రతా మార్గదర్శకాలను పాటిస్తూ ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని భక్తులకు తెలిపారు. నిమజ్జన సమయంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ప్రఖండ అధ్యక్షులు కమ్మిలి సుబ్రహ్మణ్యం, ప్రాంత ప్రముఖులు లింగం బసవ శంకరం, అవనిగడ్డ ఖండ అధ్యక్షులు గరికిపాటి హరిబాబు, గంగు దేవరాజ్ ప్రసాద్, బాంబే నుంచి వచ్చిన విజయశేఖర్, ఆలయ పూజారి, గణేష్ భక్తులు పాల్గొన్నారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పర్యావరణ హితంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు భక్తులు, మండపాల నిర్వాహకులు సహకరించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కోరారు.

## పట్టణాభివృద్ధికి రూ.33 కోట్లు ఎమ్మెల్యే బొలిశెట్టి

వర్చువల్ గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు





**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 22 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.33 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజూరు చేశారని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం స్థానిక శ్రీ బలుసులమ్మ గుడి కళ్యాణ మండపంలో హైబ్రిడ్ యాన్యువల్ మోడల్ హెచ్ఏఎం భాగంగా పట్టణాలకు మౌలిక సదుపాయాలు కల్పించే కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధికి 33 కోట్లు విలువగల పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) హాజరయ్యారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిందన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానం ద్వారా ఈ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ మౌలిక వసతుల ఆధునీకరణ, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి తోడ్పాటునందించిన ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం మరువలేనిదని, మోడీ అండదండలతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. ఈ నిధులతో కొత్త పైపులైన్లు వేసి ప్రజలకు సురక్షితమైన త్రాగునీరును అందించాలని మున్సిపల్ కమిషనర్ను బాబ్జి కోరారు. చేపట్టనున్న పనులు పూర్తయితే తాడేపల్లిగూడెం మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఈతకోట తాతాజీ, మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు,కూటమి నాయకులు వర్తనపల్లి కాశి, పట్నాల రాంపండు,అడపా ప్రసాద్, గురుజు సూరిబాబు, పసల కొండా,చాపల రమేష్, పసుమర్తి రామ్ లక్ష్మణ్,మద్దాల మణికుమార్,తదితరులు పాల్గొన్నారు

## పట్టణాభివృద్ధికి భారీగా నిధులు కేటాయింపు



**నరసాపురం ; సెప్టెంబరు 22 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా పట్టణాభివృద్ధికి, మున్సిపాలిటీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించటంపై ఎంఏ షరీఫ్. ఇంచార్జ్ రామరాజు. కొవ్వలి రామ్మోహన్ నాయుడు. భూపతి నరేష్. హర్షం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీల్లో రూ. 11,359 కోట్ల విలువైన "హైబ్రిడ్ యాన్యుటీ మోడల్" (నూాపీ) మౌలిక వసతుల పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఏ షరీఫ్. రామరాజు. కొవ్వలి రామ్మోహన్ నాయుడు. భూపతి నరేష్. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నర్సాపురం పట్టణ అభివృద్ధికి 40 కోట్ల రూపాయలు శాంక్షన్ చేసిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు కి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేసిన మాజీ శాసనమండలి చైర్మన్ ఎం ఏ షరీఫ్. టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు. ఎన్ఆర్ఐ టిడిపి సీనియర్ నాయకులు కొవ్వలి రామ్మోహన్ నాయుడు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి నరేష్. అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా సంస్థ అధ్యక్షులు దివి సత్యన్ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

మెంటేవారి తోటలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన, గంటా త్రిమూర్తులు, ఎమ్మెల్యే అంజిబాబు






**భీమవరం ; సెప్టెంబర్ 22 మీ వార్తా జిల్లా ప్రతినిధి.**
రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మెంటేవారి తోటలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా శ్రీబాలా గణేష్ యూత్, శ్రీబాలా గణేష్ సేవాదళ్ ఆధర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మరొకరికి ప్రాణం పోసే గుణం ఒక్క రక్తదానానికి మాత్రమే ఉందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదానం అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతిఒక్కరూ ఏడాదికి కనీసం రెండు లేదా మూడు సార్లు రక్తదానం చేయవచ్చని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని, మన రక్తంలో ప్రతి బొట్టూ మరొకరి జీవితంలో వెలుగులు నింపగలదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, రక్తదాతల ద్వారా మాత్రమే సేకరించి అవసరమైన వారికి అందించగలమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం పెద్ద సంఖ్యలో యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, మెంటేవారి తోట సభ్యులు, ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## కాళీపట్నం తూర్పు పంచాయతీ యొక్క గత ఐదు సంవత్సరాల సమాచారం కోరిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్టిఐ జనరల్ సెక్రటరీ నేతలు నరసింహులు


"ప్రజల కోసం – పారదర్శక పాలన కోసం"

PRAJA SANKALPA VEDIKA

NETALA NARASIMHULU

RTI GENERAL SECRETARY – WEST GODAVARI DISTRICT

Right to Information (RTI) Act, 2005

Contact: 9966064654 | Aadhaar: 970742471542

PEOPLE FOR TRANSPARENCY BETTER TOMORROW

"Right to Know Right to a Better Society"

AWARE CITIZEN TRANSPARENT GOVERNANCE ACCOUNTABLE ADMINISTRATION STRONGER DEMOCRACY

To, Date:

Subject:

సమాచారం కోరే కాలం: ప్రస్తుత/ఇటీవలి గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుండి సమాచారం అందించే తేదీ వరకు. ముందుగా బాధ్యతలు స్వీకరించిన తేదీని ధృవీకరించిన పత్రంతో ఇవ్వాలి.

పంచాయితీ అభివృద్ధి అధికారి
గ్రామ పంచాయితీ - కాళీపట్నం (తూర్పు)
మొగల్తూరు మండలం, పశ్చిమగోదావరి

Netala Narasimhulu
RTI General Secretary
West Godavari District

People's Voice | Public Information | Stronger Nation

**మొగల్తూరు ; సెప్టెంబర్ 22 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** మొగల్తూరు మండలం కాళీపట్నం (తూర్పు) పంచాయతీ యొక్క గత పాలకవర్గం , పంచాయితీ బోర్డు పాలన పైన ఆ కాలంలో జరిగిన లావాదేవీల పైన బయట వ్యక్తుల జోక్యం పైన అనేక ఆరోపణలు వచ్చిన దృష్ట్యా, పశ్చిమగోదావరి జిల్లా ఆర్టిఐ జనరల్ సెక్రటరీ , నేతల నరసింహులు మంగళవారం నాడు పంచాయతీ సెక్రెటరీనీ కలిసి ఆర్.టి.ఐ యాక్ట్ 2005 ద్వారా సమాచారం కోరడం జరిగినది, పంచాయతీ యొక్క పాలన విధానాలు పాలన పారదర్శంగా ఉంటేనే ప్రజలకు ప్రభుత్వ ఫలాలు చేకూరతాయని నేతల నరసింహులు ఈ సందర్భంగా తెలియజేశారు దీనికోసం తాను క్షేత్రస్థాయితో పాటు అవసరమైతే అమరావతికి వెళ్లి ప్రభుత్వ అధినేతలను కూడా కలిసి తన గ్రామం కోసం పోరాడతానని తెలిపారు.

## చిత్ర లేఖనం పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, సెప్టెంబర్,22** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు లలో భాగంగా సేవ సంకల్ప్ అభియాన్ 25 కోట్లు భారతీయ చిన్నారుల కలలు అనే కార్యక్రమం లో భాగంగా చిత్రాలేఖనం పోటీలు అయినవిల్లి మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఘనంగా నిర్వహించారు. సేవ సంకల్ప్ అభియాన్ మండల కన్వీనర్ సరెళ్ళ దాసు మరియు స్కూల్ చైర్మన్ ఆద్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యం గా నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారు. విద్యార్థులకు చదువు, క్రీడలు మెరుగుపరచడమే కాకుండా నూతన విద్య విధానం తో విద్యార్థుల కు మెరుగైన ఫలితాలు తీసుకురావడం లో ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది అని జేపీ అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు యనమదల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు కంచర్ల శివరామ్, సూర్యనారాయణ, నవుండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రుల్లో భారీ అన్నసమారాధన



**పెడన సెప్టెంబర్ 21 ( మీ వార్త ప్రతినిధి )** గణపతి నవరాత్రుల సందర్భంగా పెడన లోని వివిధ వార్డు లో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్ల వద్ద సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. పెడన దక్షిణ తెలుగు పాలెంలో శ్రీ బాల గణపతి స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ పందిరి వద్ద భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి సమర్పించిన లడ్డూను వేలం నిర్వహించగా, మాజీ కౌన్సిలర్ దక్షిణ తెలుగు పాలెం సిరివెళ్ల జయేష్ లడ్డూను దక్కించుకున్నారు. అలాగే అంబాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక సంయోజక్ జిల్లా సంయోజక్ లు పాల్గొన్నారు. అనంతరం భక్తుల సందడి, గణపతి నామస్మరణల మధ్య స్వామివారి నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

## కానిస్టేబుల్ సతీష్ కు రికార్డు అందజేసిన ఎస్పీ తుహిన్ సిన్హా,,




**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,సెప్టెంబరు 22 :** విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పాయకరావుపేట పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పొన్నాడ సతీష్ ను మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. అనకాపల్లిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో సతీష్ సేవలను కొనియాడుతూ సతీష్ కు రికార్డు అందజేసి అభినందించారు. మూడు నెలల క్రితం పాయకరావుపేట పట్టణంలోని దుర్గా నగర్ లో ఒకేరోజు రాత్రి మూడు స్కూటీలు దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును ఛాలెంజింగ్ గా తీసుకున్న కానిస్టేబుల్ సతీష్ సుమారు పది రోజులపాటు ట్రేస్ చేసి మూడు స్కూటీలను రికవరీ చేశారు. దీంతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సతీష్ కు ఈ రికార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మోహన్ రావు, నర్సీపట్నం డీఎస్పీ పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి రివార్డు సాధించిన కానిస్టేబుల్ సతీష్ ను పాయకరావుపేట సిఐ ఎం వినోద్ బాబు, ఎస్సైలు జుత్తు పురుషోత్తం, మహమ్మద్ ఆలీ, ఎస్ సన్యాసిరావు, ఎఎస్ఐ జెర్రిపోతుల గోవిందరావు, యజ్జల తాతయ్యలు, చింతలపూడి లచ్చన్న దొర, హెడ్ కానిస్టేబుళ్ళు కిరణ్, గోవిందరావు స్టేషన్ సిబ్బంది అభినందించారు.

## కడియద్దలో భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 22 (మీ వార్త)** మండలంలోని కడియద్దలో శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చలంచర్ల కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ వ్రతాలు జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సహకారంతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వ్రత సంకల్పంలో భాగంగా అన్నవరం నుంచి తెప్పించిన ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో చలంచర్ల బ్రదర్స్ అండ్ సన్స్ కుటుంబ సభ్యులు, శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రామాలయానికి పది లక్షల నిధులు మంజూరు

చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గిడ్డి



**అయినవిల్లి, సెప్టెంబరు 22 ( మీ వార్త విలేఖరి) :** మండలంలోని క్రాపపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుండి పది లక్షలు నిధుల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రామాలయ నిర్మాణానికి నిధుల మంజూరు కావడం ఆనందదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో నూతన ఆలయాల పునర్నిర్మాణం, పుష్కరాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులను ఆలయాల అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు..

**తాగునీరు, విద్య, మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చాం..**

**జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక**

**మచిలీపట్నం సెప్టెంబర్ 22(మీ వార్త ప్రతినిధి)** జిల్లా పరిషత్ పాలకవర్గం సేవలను అభినందించిన కలెక్టర్ డీకే బాలాజి జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగింపు సందర్భంగా ఆత్మీయ సత్కారం,కృష్ణా జిల్లా పరిషత్ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలంలో సుమారు రూ.400 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. తాగునీరు, గ్రామీణ మౌలిక వసతులు, అంత్యక్రియల షెల్టర్లు, మహిళా సాధికారత, విద్యార్థుల విద్యాభివృద్ధి, కారుణ్య నియామకాలకు ప్రాధాన్యతనిస్తూ పాలకవర్గం పనిచేసిందన్నారు. జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ఈ నెల 24వ తేదీతో పూర్తికానున్న నేపథ్యంలో మంగళవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఇతర సభ్యులను ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా నియమితులైన జిల్లా కలెక్టర్ డీకే బాలాజిని కూడా ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమానికి నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, శాసనమండలి సభ్యుడు మొండితోక అరుణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ జె. అరుణ, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడి కృష్ణా జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ, ఐదేళ్ల కాలంలో జిల్లా పరిషత్ నిధులు జిల్లాలోని ప్రతి గ్రామానికి, మారుమూల ప్రాంతాలకు చేరేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అందించిన సహకారంతోనే ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయగలిగామని పేర్కొన్నారు. సీపీడబ్ల్యూ పథకాల కింద సుమారు రూ.210 కోట్లను వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు పలు ప్రాంతాల్లో క్రిమేషన్ షెల్టర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తంగా జిల్లా పరిషత్ ద్వారా సుమారు రూ.400 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగంగా కుట్టు మిషన్లపై శిక్షణ అందించడంతో పాటు సుమారు 400 కుట్టు మిషన్లను పంపిణీ చేశామని, ఇందుకోసం సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి 'స్ఫూర్తి' పేరుతో పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ప్రతి సంవత్సరం అందించామని, ఐదేళ్లలో ఇందుకోసం సుమారు రూ.1.40 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు.

కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు కల్పించడంలో జిల్లా పరిషత్ ప్రత్యేక శ్రద్ధ చూపిందన్నారు. సుమారు 260 మందికి కారుణ్య నియామకాలు కల్పించినట్లు తెలిపారు.

కృష్ణా జిల్లా పరిషత్ 1960లో ఏర్పాటైందని, తొలి చైర్మన్ యాళ్లగడ్డ శివరామప్రసాద్ నుంచి ఇప్పటి వరకు పది మంది చైర్మన్లు సేవలందించారని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుత పాలకవర్గం ఐదేళ్ల ప్రయాణం ముగుస్తున్నప్పటికీ ఇది ముగింపు కాదని, భవిష్యత్ ప్రజాసేవకు మరో పునాది అని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో తనకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు, మీడియా ప్రతినిధులు, జిల్లా ప్రజలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి జడ్పీ వెన్నెముక: కలెక్టర్ డీకే బాలాజి,జిల్లా పరిషత్ వ్యవస్థ జిల్లా అభివృద్ధికి వెన్నెముక వంటిదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా జిల్లా పరిషత్, మండల పరిషత్ వంటి స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధమైన ప్రాధాన్యత కల్పించారని, స్థానిక వనరులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించడంలో స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.జిల్లా పరిషత్ చురుకుగా, బాధ్యతాయుతంగా పనిచేస్తే అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతాయని, ఆ విషయంలో కృష్ణా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లాకు ఎంతో కృషి చేసి, అభివృద్ధికి గణనీయంగా తోడ్పడిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు పనిచేసిన మొత్తం



పాలకవర్గానికి కృష్ణా జిల్లా ప్రజల తరఫున అభినందనలు తెలిపారు.జిల్లా పరిషత్ పాలకవర్గం విజయవంతంగా పనిచేయడంలో అధికారులు, ఉద్యోగుల పాత్ర కూడా ఎంతో కీలకమని కలెక్టర్ అన్నారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీఈఓ వరకు, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండింగ్ ఇంజనీర్ వరకు ప్రతి స్థాయిలోని ఉద్యోగులు సమన్వయంతో పనిచేసినప్పుడే సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. పాలకవర్గం పదవీకాలం పూర్తయ్యే వరకు కృషి చేసిన ప్రతి ఉద్యోగిని ఆయన అభినందించారు.ప్రజాసేవలో ఉన్నవారు తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటూ కుటుంబ సభ్యులతో పాటు సమాజంతో సత్సంబంధాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. పాలకవర్గ సభ్యుల భవిష్యత్ ప్రణాళికలు విజయవంతం కావాలని కోరుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో కే శ్రీధర్ రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ డాక్టర్ ఆనంద్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్లు గరికపాటి శ్రీదేవి, గుడిమళ్ళ కృష్ణంరాజు, ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు, ఎంపీపీ, జడ్పిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన బస్ సర్వీసును ప్రారంభించిన దొన్ను దొర

**డుంబ్రిగూడ, సెప్టెంబర్ 22 ( మీ వార్త విలేఖరి ):** మండల పరిధిలోని గుంటసీమ నుంచి కుజభంగి వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆ సంస్థ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి డా సియ్యారి దొన్ను దొర సోమవారం ప్రారంభించారు. పాడేరు నుండి గుంటసీమా వయా కుజభంభంగి వరకు ఈ సర్వీస్ నడవబోతుందని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ ప్రజలకు అవకాశం ఉన్నంతవరకు సేవలందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఈరోజు ఎన్నడూ లేని విధంగా గిరిజన ప్రాంతంలో అవకాశం ఉన్న ప్రతి చోటకు ఆర్టీసీ బస్సు సర్వీస్ నడపాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. తాను చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుంచి అనేక కొత్త రూట్ లకు సర్వీస్ లు ప్రారంభించడం జరిగిందన్నారు. మంగళవారం పాడేరు నుంచి కుజభంగి వరకు ఆర్టీసీ బస్సు సర్వీస్ రాగలిగిందంటే అది కూటమి ప్రభుత్వ విధానాల్లో ఒక భాగమైన అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలన్న ఆకాంక్షతోనే ఎక్కడికి కొత్త సర్వీస్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త సర్వీసులు ఏజెన్సీ ప్రాంతాల్లో రాబోతున్నాయని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఒకపక్క రహదారుల నిర్మాణం మరోపక్క తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చూపుతూనే సేవా రంగమైనటువంటి ఆర్టీసీ బస్సు సర్వీసులను కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఆదివాసీల గురించి ఇంత గొప్పగా ఆలోచన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి గిరిజనులు కూడా అండగా నిలవాలని సందర్భంగా ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులతో కలిసి దొన్ను దొర గారు కొద్ది దూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి శెట్టి చిరంజీవి, రాష్ట్ర కనీస వేతనం డైరెక్టర్ తుడుము సుబ్బారావు, మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, అరకు నియోజకవర్గ ౦చీఖజ అధ్యక్షుడు మండ్యగురు స్వామి, జూఖఎం చైర్మన్ పాంగి సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి కొర్ర రవి, గుడి స్వామి, అరకు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు బురిడి కొమ్ములు నాయుడు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి తడబరి చిన్నగేన్ను , బిజెపి జిల్లా కార్యదర్శి బిసోయ్ మూర్తి, జనసేన జిల్లా కార్యదర్శి కోనేడి లక్ష్మణ్, ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి బంగ్రు రాందాస్, అరకు నియోజకవర్గం వీర మహిళ రాలు కే అనూష, జనసేన మండల అధ్యక్షుడు ధనేష్, క్లస్టర్ ఇంచార్జి కొర్ర నాగరాజు, పంచాయితీ ఉపాధ్యక్షుడు కొర్ర దామోదర్, పోతంగి పంచాయితీ యువ నాయకుడు కొర్ర దామోదర్ , టిడిపి సీనియర్ నాయకుడు కిలో గంగాధర్, టీడీపీ మండల కార్యదర్శి అడకట్ల సుబ్బారావు, సొసైటీ మాజీ చైర్మన్ భాస్కరరావు, మాజీ ఎంపీపీ కొర్ర దాన్నే రావు, కో క్లస్టర్ కొర్ర బాబురావు, సాగర పంచాయతీ టిడిపి పంచాయతీ అధ్యక్షుడు కొర్ర బాబురావు, అరకు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కిల్లో సిద్దు, జనసేన ఐటి ఇన్చార్జి నరేష్, రామ్మూర్తి, కొండలరావు, మాజీ



సూపర్ ఎంపిటిసి మండియాగురు సింహాద్రి, గుంటసీమ పంచాయతీ టిడిపి అధ్యక్షు శెట్టి జక్కయ్య, మాజీ ఎంపిటిసి వంతల వెంకటరావు, అరకు పార్లమెంట్ టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షుడు జన్ని బాలరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# వాతావరణ ఎల్‌నినో ప్రభావంపై అవగాహన -- వృక్షారోపణ కార్యక్రమం

**భీమవరం: సెప్టెంబర్ 22: మీ వార్త ప్రతినిధి:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వల్ల పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో శ్రీ ఆదిత్య డిగ్రీ మహిళా కళాశాల, భీమవరం ఆధ్వర్యంలో వృక్షారోపణ కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్--1, యూనిట్--2 మరియు ఉన్త్ భారత్ అభియాన్ (యూబీఏ) వాలంటీర్లు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల ప్రాధాన్యత, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం. శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఏ. అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ బి. మావుళ్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని వారు సూచించారు. కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మం మరియు యు బి ఎ ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయి శ్రీనివాస్ సమన్వయంతో నిర్వహించారు. ఎన్ ఎస్ ఎస్ మరియు యు బి ఎ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం

**మెంటేవారి తోటలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం: సెప్టెంబర్ 22: మీ వార్త ప్రతినిధి:** రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మెంటేవారి తోటలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా శ్రీబాలా గణేష్ యూత్, శ్రీబాలా గణేష్ సేవాదళ్ ఆధర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మరొకరికి ప్రాణం పోసే గుణం ఒక్క రక్తదానానికి మాత్రమే ఉందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదానం అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతిఒక్కరూ ఏడాదికి కనీసం రెండు లేదా మూడు సార్లు రక్తదానం చేయవచ్చని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని, మన రక్తంలో ప్రతి బొట్టూ మరొకరి జీవితంలో వెలుగులు నింపగలదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, రక్తదాతల ద్వారా మాత్రమే సేకరించి అవసరమైన వారికి అందించగలమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం పెద్ద సంఖ్యలో యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, మెంటేవారి తోట సభ్యులు, ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# భగవంతుని నామస్మరణతోనే మానసిక ప్రశాంతత

**భీమవరం పట్టణంలోని పలు మండలంలోని స్వామివారిని దర్శించుకుని రూ 18 వేలు సహకారం అందించిన చైర్మన్ త్రిమూర్తులు**



**భీమవరం : సెప్టెంబర్ 22: మీ వార్త ప్రతినిధి:** భగవంతుడిని స్మరించుకోవడానికి మానసిక ప్రశాంతతను పొందడానికి ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ, వాటన్నింటిలోకల్లా నిర్మలమైన భక్తి అత్యంత శ్రేష్టమైనదని రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ డా గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం పట్టణంలోని జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా సోమవారం పలు మండపాలను చైర్మన్ త్రిమూర్తులు సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 26,10,17 వ వార్డు లో ఆయా మండపాలకు అన్న సమారాధన నిమిత్తం రూ 18 వేలు ఆర్థిక సహకారాన్ని త్రిమూర్తులు వారి వంతుగా అందించారు. నేటి దయానందితా జీవితంలో భగవంతుని నిరంతర నామస్మరణతో మనసులోని ఆందోళన తగ్గి పూర్తి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని చైర్మన్ త్రిమూర్తులు అన్నారు. అనంతరం ఆయా మండలపాలకు రూ 18 వేలు సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, 3 వ వార్డు టీడీపీ కార్యదర్శి కాపా అమర్ బాబు, ఐ టీడీపీ జిల్లా కార్యదర్శి మరపట్ల శ్యాంబాబు, నాని, కృపధనం,ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రెడ్ రేస్ యూత్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణం

**అధిక సంఖ్య లో పాల్గొన్న భక్తులు..**



**చింతూరు,సెప్టెంబర్ 22 మీ వార్త ప్రతినిధి** : మండలంలోని ఏడుగురాళ్లపల్లి గ్రామంలో మంగళవారం నాడు వినాయక చతుర్థి నవ రాత్రులు పురస్కరించుకొని రెడ్ రేస్ యూత్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం మధ్యాహ్నం ఒంటి గంటకి ఆలయ సమీపంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సుమారు వంద మంది పైగా భక్తులు పాల్గొన్నారు అని ఆలయ కమిటీ సభ్యులు, రెడ్ రేస్ యూత్ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సేవ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం విశేషం అని తెలిపారు.

# వినాయక చవితి ఉత్సవాలు మన సంస్కృతికి ప్రతీక

**వైసీపీ ఇంచార్జ్ వడ్డి రఘురాం నాయుడు**



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 22 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డు నరసింహారావు పేటలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి 40వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డి రఘురాం నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. 40 ఏళ్లుగా నిర్విరామంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతి ఏటా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందన్నారు.

అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు,వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112